
News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 04 | సంచిక :333 | ఖమ్మం | మంగళవారం జనవరి 13, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## మన జెన్-జెడ్‌లో ఎంతో సృజనాత్మకత నిండి ఉంది


- 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి
- వివేకానందుడి జీవితం, బోధనల నుంచి స్ఫూర్తితో ఈ వేదికను ప్రారంభించినట్లు వెల్లడి
- యువత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని వెల్లడి

నేను ముఖ్యమంత్రిగా ఉన్నా, ప్రధానమంత్రిగా ఉన్నా దేశ యువతపై తనకు ఎప్పుడూ మంచి విశ్వాసం ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన జెన్-జెడ్ తరం సృజనాత్మకతతో నిండి ఉందని ఆయన ప్రశంసించారు. 'వికసిత్ భారత్

వివరాలు 2లో..

## కదిలే లక్ష్యాన్ని ఛేదించే యాంటీ టాంక్ మిస్సైల్...

డీఆర్డీవోకు రాజ్‌నాథ్ సింగ్ అభినందనలు



- MPATGM యాంటీ-ట్యాంక్ క్షిపణి పరీక్ష విజయవంతం
- కదిలే టార్గెట్ ను సైతం ఛేదించిన కొత్త అస్త్రం
- భారత సైన్యంలోకి చేరేందుకు సిద్ధమైన క్షిపణి
- ఆత్మనిర్భర్ భారత్‌లో ఇది కీలక ముందడుగు అని వ్యాఖ్య

వివరాలు 2లో..

# జిల్లాల పునర్విభజనకు కమిషన్



- విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఏర్పాటు చేస్తాం
- వారసత్వ అప్పులు, తప్పులను కప్పిపుచ్చుకుంటూ వెళ్తున్నాం
- టీజీఓ డైరీ ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

జిల్లాల పునర్విభజనపై ఎలాంటి అపోహ లొద్దని.. ఈ ప్రక్రియను హేతుబద్ధంగా చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. త్వరలోనే హైకోర్టు లేదా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆ కమిషన్ ఆర్నెల్లపాటు రాష్ట్రమంతటా తిరిగి అభిప్రాయాలు స్వీకరిస్తుందని పేర్కొన్నారు. సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టీజీఓ) కేంద్ర సంఘం 2026 డైరీ, క్యాలెండర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "గతంలో నచ్చితే నజరానా అన్నట్లు.. మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలు ఏర్పాటుచేసి వెళ్లిపోయారు. ఒక జిల్లాలో ఒక నియోజకవర్గం.. మరో జిల్లాలో 14 నియోజకవర్గాలున్నాయి. అశాస్త్రీయంగా విభజించారు. వరంగల్, హనుమకొండలను ఒకటే జిల్లా చేయాలని డిమాండ్ వస్తోంది. జిల్లాలు తగ్గించడమా? పెంచడమా అనేది నేను చెప్పను. హేతుబద్ధంగా జరగాలి. జిల్లాల పునర్విభజనపై వచ్చే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో కూలంకషంగా చర్చిద్దాం. మేం వచ్చిన తర్వాత పోలీసు కమిషనరేట్ సరిహద్దులు మాత్రమే మార్చాం.

## పోలవరం-నల్లమలసాగర్‌పై... రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదు

స్పష్టం చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

ఉపసంహరించుకున్న తెలంగాణ ప్రభుత్వం

వెంటనే సివిల్ సూట్ దాఖలు చేస్తామని వెల్లడి



పోలవరం-నల్లమలసాగర్ ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్‌కు సీడబ్ల్యూసీ ఆమోదం తెలపకముందే ఆ ప్రాజెక్టు డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. "ప్రాథమికంగా ఈ రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేకపోవడంతో దానిపై విచారణను ముగిస్తున్నాం. అదే సమయంలో ఈ పిటిషన్‌లో పేర్కొన్న అన్ని అంశాలపై చట్టప్రకారం తగిన పరిష్కారాలు

వివరాలు 2లో..

## ఆరు గంటలకు పైగా నటుడు విజయ్‌ని ప్రశ్నించిన సీబీఐ

- తొలిరోజు ముగిసిన విజయ్ సీబీఐ విచారణ
- తొక్కిసలాట ఘటనకు టీవీకేకు సంబంధం లేదన్న విజయ్
- పరిస్థితి చేయి దాటిపోకూడదని అక్కడి నుంచి వెళ్లిపోయానన్న విజయ్



కరూర్ తొక్కిసలాట ఘటనపై సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ సీబీఐ తొలిరోజు విచారణ ముగిసింది. విజయ్‌ను ఆరు గంటలకు పైగా విచారించిన సీబీఐ అధికారులు, ఆయన వాంగ్మూ లాన్ని నమోదు చేశారు.

వివరాలు 2లో..

## పోలవరం ప్రాజెక్టులో మిగిలిన నీటిని తెలంగాణ వినియోగించుకోవచ్చు

- తెలంగాణ ప్రాజెక్టులు కట్టినప్పుడు తాను వ్యతిరేకించలేదని వెల్లడి
- నల్లమలసాగర్ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్న చంద్రబాబు
- సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సమీక్ష




పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ రాష్ట్రం కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులు

వివరాలు 2లో..

## బీసీలకు 34 శాతానికి పైగా రిజర్వేషన్లు

ఎస్సీ, ఎస్టీలకు కలిపి 15 శాతానికి పైగా..

మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లపై బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక




రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లను ఖరారు చేస్తూ డెడికేటెడ్ కమిషన్ ప్రభుత్వానికి సోమవారం నివేదిక సమర్పించింది. మున్సిపాలిటీల వారీగా వార్డులు, ఛైర్‌పర్సన్ల స్థానాలకు బీసీ రిజర్వేషన్లను పేర్కొంది. మొత్తం 50 శాతం రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తీసివేయగా మిగిలినవి బీసీలకు కేటాయించింది. గ్రామాలతో పోల్చితే పట్టణాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా తక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీలకు కలిపి దాదాపు 15 శాతానికిపైగా రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు సమాచారం. బీసీలకు 34 శాతానికిపైగా రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ పేర్కొన్నట్లు తెలిసింది. కమిషన్ నివేదిక ఆధారంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లను ఒకటి, రెండు రోజుల్లో ఖరారు చేసే అవకాశం ఉంది. అనంతరం తుది నివేదికను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పురపాలక శాఖ అందజేస్తుంది.

**రాష్ట్రంలో 52,42,993 మంది ఓటర్లు**

రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న 117 పురపాలికలు, ఆరు కార్పొరేషన్లలో మొత్తం 52,42,993 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. మొత్తం ఓటర్లలో

వివరాలు 2లో..

## సమీకృత గురుకులాల నిర్మాణం పూర్తికి క్యాలెండర్ ప్రకటించాలి



రాష్ట్రంలో సమీకృత గురుకులాల నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు క్యాలెండర్ ఖరారు చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆదేశించారు. సమీకృత గురుకులాలు ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్టని ఆయన పేర్కొన్నారు. వాటి నిర్మాణానికి 15 రోజులకోసారి బిల్లుల చెల్లింపులు చేస్తామని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'జిల్లా కలెక్టర్లు ప్రతివారం గురుకులాల నిర్మాణంపై సమీక్ష నిర్వహించాలి. నెలకోసారి నిర్మాణ ప్రదేశానికి వెళ్లి ప్రగతిపై ఆరా తీయాలి. పాఠశాలల నిర్మాణానికి నిధుల కొరత లేదు. ఒప్పందం చేసుకున్న

వివరాలు 2లో..

## అస్థిరతను అధిగమించేలా బంధాల బలోపేతం



- గాంధీ బోధనలు ఇప్పుడింకా అవసరం
- మోదీతో భేటీలో జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్

అహ్మదాబాద్: ప్రపంచవ్యాప్త అస్థిర పరిస్థితుల్లో సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు పరస్పరం సహకరించుకోవాలని భారత్, జర్మనీ ప్రతిపాదించుకున్నాయి. ఆ మేరకు బంధాలు బలోపేతం చేసుకోవాలని జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయించుకున్నారు. మహాత్మాగాంధీ బోధనలు ఇప్పుడింకా అవసరమని ఫ్రెడ్రిక్ పేర్కొన్నారు. భారత్‌లో రెండ్రోజుల పర్యటన కోసం సోమవారం వచ్చిన ఆయన అహ్మదాబాద్‌లో

వివరాలు 2లో..

## 'వీబీ-జీ రామ్ జీ'పై ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం

పేర్ల కన్నా పథకాల అమలే ముఖ్యం

మేడారం జాతరకు ఈసారి కేంద్రం నిధులిస్తుంది

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



'వీబీ-జీ రామ్ జీ' చట్టంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఈ కొత్త చట్టం అమలుతో తెలంగాణకు కేంద్రం అదనంగా రూ.340 కోట్లు ఇవ్వనుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మోదీ ప్రధాని అయ్యాక అనేక పథకాల్లో సంస్కరణలు తీసుకొచ్చారు. జీఎస్టీ పన్ను విధానాన్ని సులభతరం చేశారు. తాజాగా ఉపాధి హామీ చట్టానికి సాంకేతికతతో మెరుగులు దిద్ది, పనిదినాలు పెంచాలనే ప్రయత్నం చేస్తున్నారు.

వివరాలు 2లో..

# కదిలే లక్ష్యాన్ని ఛేదించే యాంటీ టాంక్ మిస్సైల్...
# డీఆర్డీవోకు రాజ్‌నాథ్ సింగ్ అభినందనలు

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. మూడో తరానికి చెందిన మ్యాన్ పోర్టబుల్ యాంటీ-ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ (వీూూ+వీ)ను విజయవంతంగా పరీక్షించింది. కదులుతున్న లక్ష్యాన్ని సైతం అత్యంత కచ్చితత్వంతో ఛేదించే ఈ క్షిపణి పరీక్ష విజయవంతం కావడం పట్ల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్డీవో బృందాన్ని, పరిశ్రమ వర్గాలను అభినందించారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. మహారాష్ట్రలోని అహిల్య నగర్‌లోని కేకే రేంజెస్‌లో ఈ పరీక్షను నిర్వహించారు. హైదరాబాద్‌లోని డీఆర్డీవో ల్యాబొరేటరీ అభివృద్ధి చేసిన ఈ క్షిపణి, నిర్దేశిత కదిలే లక్ష్యాన్ని విజయవంతంగా ధ్వంసం చేసింది. ఈ విజయంతో ఈ ఆయుధ వ్యవస్థను భారత సైన్యంలోకి ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమమైందని డీఆర్డీవో ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ తెలిపారు.పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణిలో అత్యాధునిక టెక్నాలజీలు ఉన్నాయి. ఇందులో ఉండే ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ (××=) హోమింగ్ సీకర్ సహాయంతో పగలు, రాత్రి వేళల్లోనూ శత్రు ట్యాంకులను గుర్తించి నాశనం చేయగలదు. ట్యాంకు పైభాగంలో దాడి చేసే 'టాప్ ఎటాక్' సామర్థ్యం, ఆధునిక యుద్ధ ట్యాంకులను సైతం ధ్వంసం చేయగల టెన్డం వార్‌హెడ్ దీని ప్రత్యేకతలు. ఈ క్షిపణిని ట్రైపాడ్ పైనుంచి లేదా సైనిక వాహనం నుంచి ప్రయోగించవచ్చు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (దీణా), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (దీజూ) ఈ ఆయుధ వ్యవస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నాయి.

## పోలవరం-నల్లమలసాగర్‌పై... రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదు

-మొదటిపేజీ తరువాయి

ఎంచుకోవడానికి పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తున్నాం" అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పిటిషన్‌పై ఈ నెల 5న విచారించినప్పుడే సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం దాని విచారణార్హతపై అనుమానం వ్యక్తంచేసింది.

కావాలంటే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించింది. ఆ సూచనను పరిశీలించి అభిప్రాయం చెప్పడానికి వారం రోజుల గడువు ఇవ్వాలని తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్‌సింఘ్వీ కోరడంతో ధర్మాసనం కేసు విచారణను 12వ తేదీకి వాయిదా వేసింది. దాని ప్రకారం సోమవారం విచారణ ప్రారంభమైన వెంటనే అభిషేక్‌సింఘ్వీ జోక్యం చేసుకుంటూ తాము దాఖలు చేసిన పిటిషన్‌ను ఆర్టికల్ 32కింద విచారణకు స్వీకరించవచ్చని ధర్మాసనానికి విన్నవిస్తూ సంబంధిత వాదనలను లిఖితపూర్వకంగా సమర్పించారు. తమ నోట్‌ను పరిశీలించాక మీరు ఏ అభిప్రాయం వ్యక్తంచేస్తే దాని ప్రకారం నడుచుకుంటామని విన్నవించారు.

"ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన పిటిషన్‌ను ఎందుకు విచారణకు స్వీకరించాలన్న కారణాలను ఇందులో వివరించాం. గోదావరి ట్రైబ్యునల్ 1979-80లో ఆవిరయ్యే నీటితో కలిపి ఏపీకి 484.5 టీఎంసీలు కేటాయించింది. వరద నీరనో, ఇంకో పేరో చెప్పి అంతకుమించి నీటిని మళ్లించడానికి ప్రయత్నిస్తే అది చట్టవిరుద్ధమవుతుంది. అప్పుడు ఆర్టికల్ 32కింద జోక్యం చేసుకోవడానికి కోర్టుకు అధికారం ఉంటుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు కేటాయించిన టీఎంసీలకు మించి నీటిని వాడుకోవడానికి అవసరమైన మౌలిక వసతులను సమకూర్చుకుంటోంది. ఇవన్నీ ఆర్టికల్ 32కిందికి వచ్చే అంశాలే. అలాగే విభజన చట్టంలోని సెక్షన్ 84(3)(ఐఐ), 85(8)(డి)లను ఏపీ బహిరంగంగా ఉల్లంఘిస్తోంది. ఆంధ్రప్రదేశ్ చేపట్టే ప్రాజెక్టులు అంతర్రాష్ట్ర అంశాలపై ప్రభావం చూపెట్లయితే తప్పనిసరిగా జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ, జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథరిటీ, ఎపెక్స్ కౌన్సిల్, కేంద్ర పర్యావరణ అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని ఈ సెక్షన్లు చెబుతున్నాయి" అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.అప్పుడు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ "మీరు ఈ సెక్షన్లలోని అంశాలను సవాల్ చేయడం లేదు. ఆంధ్రప్రదేశ్ కొన్ని చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘిస్తోందని చెప్పడానికి మాత్రమే ఈ సెక్షన్లను ఉదాహరణగా చూపుతున్నారు. చట్ట ప్రకారం కేటాయించిన నీటికి మించి వాడుకోవడానికి ఏపీ ప్రయత్నిస్తోందని చెబుతున్నారు కదా" అని ప్రశ్నించారు. అందుకు అభిషేక్‌సింఘ్వీ బదులిస్తూ అది తమ వాదనల్లో ఒక భాగం మాత్రమేనని, మొత్తంగా ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్‌కు విచారణార్హత ఉందన్నదే తమ ప్రధాన అభిప్రాయమన్నారు. కేంద్ర జలసంఘం 2017, 2025లలో జారీ చేసిన మార్గదర్శకాలను ఆంధ్రప్రదేశ్ పూర్తిగా ఉల్లంఘిస్తోందన్నారు. సివిల్‌సూట్‌లో చాలా పరిమితులు ఉంటాయన్నారు.అందుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ "సివిల్ సూట్‌కు విస్తృతి ఎక్కువగా ఉంటుంది. అక్కడ సాక్ష్యాధారాలను లోతుగా పరిశీలించవచ్చు" అని అన్నారు. జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి జోక్యం చేసుకుంటూ "గోదావరి ట్రైబ్యునల్ అవార్డులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకలూ వస్తాయి. మీ రిట్ పిటిషన్‌లో అవి పార్టీలుగా లేవు. సివిల్ సూట్‌లో ఇలాంటి వాటన్నింటినీ సంపూర్ణంగా పరిగణనలోకి తీసుకోవడానికి వీలవుతుంది" అని పేర్కొన్నారు.దాంతో "ఇప్పుడు మేం ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకొని, వెంటనే సివిల్ సూట్ దాఖలు చేస్తాం. అది ఇప్పటికే దాదాపు తయారైంది. సూట్‌పైనా ప్రతివాదులు సాంకేతిక కారణాలతో అభ్యంతరాలు వ్యక్తంచేస్తే న్యాయమూర్తులే దాఖలు చేయాలని సూచించారంటూ మేం చెబుతాం. ఎందుకంటే మేం అన్నిచోట్లా పరిష్కారాలు లేనివారీగా మిగిలిపోలేం" అంటూ సింఘ్వీ విన్నవించారు. జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ పిటిషన్‌కు విచారణార్హత లేదని ప్రతివాదులు వ్యక్తంచేసిన అభ్యంతరంపై ఇక్కడ విన్నట్లుగానే అక్కడా వినాల్సి ఉంటుందన్నారు. అభ్యంతరాలు వ్యక్తం చేసే హక్కు అందరికీ ఉంటుందన్నారు.అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ... అలాగైతే కోర్టు సూచన మేరకు మేం ఉపసంహరించుకుంటున్నామని, తర్వాత సివిల్‌సూట్ దాఖలు చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొనాలని విజ్ఞప్తి చేశారు. ఆ వినతిపై ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యంతరం వ్యక్తంచేశారు. కోర్టు చెప్పడంతోనే సివిల్ సూట్ దాఖలు చేశామని వారు ముందస్తు ఉత్తర్వులు (అడ్వాన్స్ రూలింగ్) కోరుతున్నారని, అలా చేయకూడదన్నారు. అందుకు జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ తాము ఎవరివైపూ ఎలాంటి అడ్వాన్స్ రూలింగ్ ఇవ్వడంలేదని నవ్వుతూ అన్నారు. సింఘ్వీ జోక్యం చేసుకుంటూ అలాగైతే ఎలాంటి అభిప్రాయాలూ వ్యక్తం చేయకుండా పిటిషన్ ఉపసంహరించుకోవడానికి తమకు అనుమతివ్వాలని ధర్మాసనానికి విన్నవించారు. ఇందులో సున్నితాంశాలు ఇమిడి ఉన్నందున డిస్మిస్ చేసినట్లు పేర్కొనవద్దని కోరారు.జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ "పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లుగా భావిస్తూ డిస్మిస్ చేస్తున్నాం (డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్). అయితే పిటిషనర్ రాష్ట్రం తగిన పరిష్కారాలు అందుకోవడానికి చట్టప్రకారం అన్ని వివాదాస్పద అంశాలు ప్రస్తావించడానికి స్వేచ్ఛనిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఉత్తరుల్లో పేర్కొన్న డిస్మిస్డ్ అన్న పదాన్ని తొలగించి డిస్పోజ్డ్ ఆఫ్ అని చేర్చాలని సింఘ్వీ విన్నవించగా... అందుకు ప్రధాన న్యాయమూర్తి అంగీకరించారు.

# జిల్లాల పునర్విభజనకు కమిషన్

- మొదటి పేజి తరువాయి

దొరల కోట పేరుపెడితే రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్పుచేశాం.

**మనమంతా ఒకే కుటుంబం**

చాలామంది సంఘాల నేతలు ప్రభుత్వంతో కుమ్మక్కయ్యారని అంటున్నారని ప్రచారం జరుగుతోంది. మనమంతా ఒకే కుటుంబం.. మేం నిర్ణయాలు తీసుకుంటే.. మీరు అమలు చేస్తారు. కలిసి ఉంటే అసూయపడే వారు ఎప్పుడూ ఉంటారు. గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన అప్పులను, తప్పులను కప్పిపుచ్చుకుంటూ వెళ్తున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపు మొత్తాన్ని పెంచుతాం. గతంలో మీకు వేతనాలు ఎప్పుడొచ్చేవి.. నేను వచ్చాక ఎలా వస్తున్నాయో గమనించాలి. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం పెట్టి ఇక్కడికి వచ్చాను. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించాం. మీ ఆరోగ్య భద్రత పథకంపైనా చర్చిస్తున్నాం. గతంలో బకాయిలకు సంబంధించి నెలకు రూ.200 కోట్లు ఇచ్చేవారు కాదు.. ఇప్పుడు రూ.750 కోట్లు ఇస్తున్నాం. ప్రభుత్వోద్యోగులకు రూ.12 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి బకాయిల చెల్లింపు పెంచుతాం. ఆదాయం పెంచుకోవడానికి పన్నులు పెంచాల్సిన అవసరం లేదు. జీఎస్టీ, ఎక్సైజ్, ఇసుక, భూమి తదితరాల్లో అవకతవకలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టాలి. నగరాల్లో ఇంటి పన్ను సరిగ్గా వసూలు చేస్తే ఆర్థిక పరిస్థితే మారుతుంది. దేశంలోనే ఆదర్శంగా ఉండేలా టీజీఓలు హైదరాబాద్‌లో కార్యాలయం నిర్మించుకోవాలి.

టీజీఓ డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సహదేవ్, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, శ్యామ్, ఠాకూర్, అనిల్‌కుమార్ యాదవ్

**ఉద్యోగులే ప్రభుత్వ సారథులు.. వారధులు**

గత ప్రభుత్వం పదవీ విరమణ వయసు పెంచడం వల్ల ఉద్యోగులకు చెల్లించని రూ.11 వేల కోట్ల భారాన్ని మాకు ఇచ్చి వెళ్లారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు రూ.42 వేల కోట్లు.. సింగరేణి, విద్యుత్తుశాఖ.. ఇలా మొత్తం 1.11 లక్షల కోట్ల బకాయిలు.. వీటికి బ్యాంకు రుణాలు అదనం. అందుకే అసెంబ్లీలో శ్వేతపత్రం ప్రవేశపెట్టాం. ప్రభుత్వం నడవాలంటే ప్రతి నెలా రూ.30 వేల కోట్లు అవసరం. కొన్ని పథకాలను పక్కనబెట్టినా రూ.22,500 కోట్ల ఖర్చు ఉంటుంది. ఆదాయం మాత్రం రూ.18 వేల కోట్లే. ప్రభుత్వంలో ఉన్న 200 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరు. 10.50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులే నడిపిస్తారు. ఈ సర్కారు వచ్చిన తర్వాత మారింది కేవలం 15 మంది మంత్రులే. ఉద్యోగులు అప్పటివారే ఉన్నారు. వారే ప్రభుత్వ సారథులు, వారధులు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యమిస్తాం.

**'అంతులేని కథ' సినిమాలా నా పరిస్థితి..**

ముఖ్యమంత్రి అయిన రెండేళ్లలో ఒక్కరోజు కూడా నేను సెలవు తీసుకోలేదు. నేను చిన్నప్పుడు అంతులేని కథ సినిమా చూశా. అందులో జయప్రద కుటుంబ బాధ్యతల కారణంగా తన ఆనందాన్ని పక్కనపెట్టి కష్టపడుతూనే ఉంటుంది. నేను కూడా సీఎం పదవి వస్తే సంతోషంగా ఉండొచ్చని అనుకున్నా. ఇప్పుడు మరింత బాధ్యత పెరిగింది. అంతకుముందు పార్టీ అధ్యక్షుడిగా 12 గంటలు పనిచేస్తే చాలు. ఇప్పుడు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవడం లేదు" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్, కోశాధికారి సహదేవ్, సహాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

**ఎడ్యుకేషన్ కిట్ నాణ్యతలో రాజీ పడొద్దు: సీఎం**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్న 22 వస్తువులతో కూడిన ఎడ్యుకేషన్ కిట్ల నాణ్యతలో రాజీపడొద్దని, ఇందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కేంద్రీకృత, లోకల్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో సమీకరించే వస్తువులపై సమగ్ర అధ్యయనం చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కిట్‌లు అందించేలా చూడాలన్నారు. సోమవారమిక్కడ తన నివాసంలో సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల విద్యార్థులకు అందించే వస్తువుల ప్రొక్యూర్‌మెంట్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. "యూనిఫాం, స్కూల్‌బెల్ట్, టై, షూస్, బ్యాగ్, నోట్‌బుక్స్ ఇతర వస్తువులు కిట్‌లో ఉంటాయి. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులపై వెంటనే పూర్తి వివరాలు అందించాలి" అని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, వేంనరేందర్‌రెడ్డి, సంక్షేమశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్, సీఎం కార్యదర్శులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సమీకృత గురుకులాల నిర్మాణం పూర్తికి క్యాలెండర్ ప్రకటించాలి

- మొదటి పేజి తరువాయి

15 రోజుల్లో గుత్తేదారులు పని ప్రారంభించకుంటే కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. వచ్చే విద్యాసంవత్సరం నాటికి అత్యధికంగా సమీకృత గురుకులాలు అందుబాటులోకి రావాలి. పనుల ప్రగతిపై వారానికోసారి సీఎస్ కలెక్టర్ల నుంచి నివేదికలు తీసుకోవాలి' అని భట్టి సూచించారు.

## బీసీలకు 34 శాతానికి పైగా రిజర్వేషన్లు

- మొదటి పేజి తరువాయి

25,62,358 మంది పురుషులు కాగా, 26,80,005 మంది మహిళా ఓటర్లు, 630 మంది ఇతరులు ఉన్నట్లు పేర్కొంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా తుది ఓటర్ల జాబితాను సోమవారం ప్రచురించారు.
త్వరలో షెడ్యూలు!రిజర్వేషన్లపై పురపాలక శాఖకు బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పించడంతో పాటు ఓటర్ల తుది జాబితా ప్రచురితం కావడంతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అయినట్లయింది. ఎన్నికల సంఘం త్వరలో షెడ్యూలు వెలువరించే అవకాశం ఉంది.

# మన జెన్-జెడ్‌లో ఎంతో సృజనాత్మకత నిండి ఉంది

-మొదటిపేజీ తరువాయి

యంగ్ లీడర్స్ డైలాగ్' ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వివేకానందుడి జీవితం, బోధనల నుంచి స్ఫూర్తి పొంది 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' వేదికను స్థాపించినట్లు తెలిపారు.వినూత్న ఆలోచనలు, లక్ష్యాలు, ఉత్సాహంతో దేశ నిర్మాణంలో జెన్-జెడ్ ముందు వరుసలో ఉందని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో యువత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువచ్చిందని చెప్పారు. ఈ క్రమంలోనే దేశంలో స్టార్టప్ విప్లవం

ఊపందుకుందని అన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రారంభించిన సంస్కరణల పరంపర ఇప్పుడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా మారిందని, వీటికి కేంద్ర బిందువు యువతే అని ఆయన స్పష్టం చేశారు.దేశ యువతకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' వేదికను రూపొందించారు. ఈ నెల 9 నుంచి 12 వరకు నిర్వహించిన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమాల్లో దేశవ్యాప్తంగా 50 లక్షల మందికి పైగా యువత పాల్గొన్నారు.

## ఆరు గంటలకు పైగా నటుడు విజయ్‌ని ప్రశ్నించిన సీబీఐ

-మొదటిపేజీ తరువాయి

సంక్రాంతి తర్వాత సీబీఐ మరోసారి ఆయనను విచారించనుంది. తొక్కిసలాట ఘటనకు టీవీకేకు ఎలాంటి సంబంధం లేదని ఆయన విచారణ సందర్భంగా అధికారులతో చెప్పినట్లు సమాచారం. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకే తాను అక్కడి నుంచి వెళ్లిపోయానని ఆయన తెలిపారు.ఇదే వ్యవహారంపై పార్టీ కార్యకర్తలను సీబీఐ ప్రశ్నించినప్పుడు కూడా వారు ఇదే తరహా సమాధానం చెప్పారని తెలుస్తోంది. విజయ్ నుంచి మరిన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాల్సి ఉంది. అయితే, పొంగల్ సందర్భంగా తనకు విరామం కావాలని విజయ్ కోరగా, సీబీఐ అందుకు అంగీకరించిందని సమాచారం. విజయ్ విచారణకు వస్తున్నాడని తెలుసుకున్న అభిమానులు పెద్ద సంఖ్యలో సీబీఐ కార్యాలయానికి చేరుకున్నారు.గత సంవత్సరం సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దీనిపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు పలు వివరాలు సేకరించారు.

## పోలవరం ప్రాజెక్టులో మిగిలిన నీటిని తెలంగాణ వినియోగించుకోవచ్చు

-మొదటిపేజీ తరువాయి

నిర్మించినప్పుడు తాను ఎప్పుడూ అడ్డు చెప్పలేదని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఆయన మంత్రులు, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం ఉండదని స్పష్టం చేశారు. ఎగువ నుంచి విడుదల చేసిన నీటిని పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తరలించి వాడుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకోవచ్చని అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆశలను తాము నిలబెట్టామని, వారిలో విశ్వాసాన్ని కల్పించామని ఆయన అన్నారు. 2025 సంవత్సరం మంచి ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. విధ్వంసమైన వ్యవస్థల నుంచి సుపరిపాలనను గాడిలో పెట్టామని అన్నారు. సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగవంతం చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా మరింత కష్టించి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమలు చేసిన పథకాలు, వాటి ద్వారా లబ్ధి పొందిన వివరాలను ఆయన పేర్కొన్నారు.రాజధాని అమరావతిని గతంలో శ్మశానం, ఎడారి అని హేళన చేశారని, కానీ ఇప్పుడు అది ఒక స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని ఆయన అన్నారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామని అన్నారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు అని, అది పూర్తయితే దక్షిణ భారతదేశంలో ఏ రాష్ట్రం కూడా మనతో పోటీ పడలేదని అన్నారు.త్వరలో భోగాపురం విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటును కేంద్ర ప్రభుత్వం సహకారంతో కాపాడుకున్నట్లు చెప్పారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ అని స్పష్టం చేశారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే వచ్చాయని అన్నారు. పెట్టుబడులకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ మారిందని అన్నారు.

## 'వీబీ-జీ రామ్ జీ'పై ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం

- మొదటి పేజి తరువాయి

కూలీల పనిదినాలు 100 నుంచి 125 రోజులకు పెరగనున్నాయి. అడిగిన ప్రతి కూలీకి తప్పనిసరిగా పని కల్పించాల్సిందే. ఏ కారణంతోనైనా కల్పించలేకపోతే వారికి పరిహారం చెల్లించాలనే నిబంధనను చట్టంలో పొందుపరిచాం. అలాగే కూలి సకాలంలో జమకాకపోతే, బాధ్యులకు జరిమానా విధించే విధానం కూడా ఉంది. తాజా సంస్కరణలతో రాష్ట్రాలపై అదనపు భారం పడుతుందని అంటున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం కూడా అదనపు భారం మోస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.17 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయబోతోంది. తెలంగాణకూ గతేడాది కంటే అదనపు నిధులు అందనున్నాయి. గతంలో దళారులు, రాజకీయ నాయకులు ఈ పథకం పేరుతో భారీగా దోపిడీ చేసేవారు. దానిని అరికట్టేందుకు డిజిటల్ లావాదేవీల ద్వారా చెల్లింపులు చేపట్టనున్నాం. పథకాల పేర్లకన్నా అమలే ముఖ్యం. వాల్మీకి అంబేడ్కర్ ఆవాస్ యోజనను మేమే ప్రారంభించాం. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం దాని పేరు మార్చింది. బేగంపేట విమానాశ్రయం ఎన్టీఆర్ పేరుతో ఉండేది. తర్వాత రాజీవ్‌గాంధీ పేరుతో కాంగ్రెస్ మార్చలేదా? యూపీఏ హయాంలో జరిగిన కోల్ స్కామ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు కోల్‌బ్లాక్స్, మైనింగ్ బ్లాక్స్ అన్నీ వేలం ద్వారా పారదర్శకంగా కేటాయిస్తున్నాం. రాబోయే మూడేళ్లలో అనేక రంగాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకొస్తాం' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో భాజపా ఎంపీల విజయం గాలివాటం అని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి బదులిస్తూ.. 'రాష్ట్రంలో భారాస పని అయిపోయింది. భాజపా విజయం గాలివాటం ఎలా అవుతుంది? దేశంలో మూడుసార్లు అధికారంలోకి రావడం గాలివాటమా? పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కేంద్రాన్ని రాష్ట్రం అడగడంలో తప్పేమీ లేదు. మేడారం జాతరకు గతంలో నేను కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం నిధులు వచ్చేలా కృషి చేశాను. ఈసారి కూడా జాతరకు నిధులిస్తాం' అని వెల్లడించారు.

**ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు**

అంతకుముందు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ యువజన దినోత్సవం వేడుకల్లో కిషన్‌రెడ్డి పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, నాయకులు ఎన్.గౌతంరావు వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గోబెల్స్ కాదు... ఇక 'జగన్ బెల్స్' అని పిలవాలేమో!

-మొదటిపేజీ తరువాయి

ఇప్పుడు జగన్ బృందం తీరు చూస్తుంటే దాన్ని 'జగన్ బెల్స్' ప్రచారం అని పిలవాల్సి వస్తోందని ఎద్దేవా చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపడానికి, జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం పెంచడానికి నిరంతరం శ్రమిస్తున్నారని పార్థసారథి తెలిపారు. అయితే, అధికారం కోల్పోయిన వైసీపీ నేతలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై పోరాడాల్సింది పోయి, ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. వారి తీరు చూస్తుంటే "వంద ఎలుకలు తిన్న పిల్లి కాశీ యాత్రకు వెళ్లినట్లు"ఉందని, రాష్ట్ర ఆదాయానికి కీలకమైన ఆధ్యాత్మిక పర్యాటకాన్ని దెబ్బతీయడానికి కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు వైసీపీ పెద్ద కుట్ర పన్నిందని పార్థసారథి ఆరోపించారు. ఇటీవల తిరుమలలో మద్యం సీసాలు దొరికాయని చేసిన ప్రచారం వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని అన్నారు. "తిరుపతిలో ఖాళీ మద్యం సీసాలను కొనుగోలు చేసి, వాటిని కొండపైకి తీసుకెళ్లి పెట్టి.. అపవిత్రం జరిగిందని నమ్మించే ప్రయత్నం చేశారు. చంద్రబాబు గారు ఏర్పాటు చేసిన వేల సీసీ కెమెరాల వల్ల ఈ కుట్ర బయటపడింది. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారు పోలీసులకు చిక్కారు. వారు సాక్షి పత్రిక విలేకరులో లేదా భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులో అని తిరుపతిలో చర్చ జరుగుతోంది" అని ఆయన వివరించారు. గతంలో వెంకటేశ్వర స్వామిని 'నల్లరాయి' అని కించపరిచిన భూమన, ఇప్పుడు ఒంటినిండా నామాలు పెట్టుకుని హిందువునని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.వైసీపీ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం కోసం వాడిన నెయ్యిలో కనీసం 20 శాతం స్వచ్ఛత కూడా లేదని, పామాయిల్, జంతువుల కొవ్వు కలిసిందన్న ఆరోపణలపై విచారణ జరుగుతోందని మంత్రి వెల్లడించారు. కేవలం ముడుపుల కోసమే నాణ్యత లేని సంస్థల నుంచి నెయ్యి కొన్నారని ఆరోపించారు. దేవుడిపై నమ్మకం లేని భూమనకు ఛైర్మన్ పదవి ఇచ్చి, తిరుమల నిధులను భక్తుల సౌకర్యాలకు కాకుండా తిరుపతిలో రాజకీయ లబ్ధి కోసం ఖర్చు చేశారని దుయ్యబట్టారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సాక్షులు అనుమానాస్పదంగా మరణించినట్లే, వైసీపీ హయాంలో జరిగిన పరకామణి దొంగతనం కేసులో సాక్షిగా ఉన్న అధికారి కూడా రైలు కింద పడి చనిపోవడం వెనుక ఉన్న మిస్టరీ ఏమిటని ప్రశ్నించారు. గోవిందరాజస్వామి ఆలయంలో బంగారు తాపడం కోసం వాడాల్సిన కిలోల కొద్దీ బంగారాన్ని సైతం దోచేశారని ఆరోపించారు. గత ఐదేళ్ల తమ దోపిడీని కప్పిపుచ్చుకోవడానికే వైసీపీ ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని, ప్రజలు వాస్తవాలను గమనించా లని కోరారు. "మీరు అభివృద్ధికి సహకరించకపోయినా ఫర్వాలేదు, కనీసం నోరు మూసుకుని ఉండి రాష్ట్రంపై విషం చిమ్మకండి" అని వైసీపీ నేతలకు ఆయన హితవు పలికారు.

# స్వామి వివేకానంద 164 జయంతి వేడుకలు..

**ముఖ్య అతిథిగా భద్రాచలం బ్రేక్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య...**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),జనవరి 12:**భద్రాచలం లో ఘనంగా శ్రీ స్వామి వివేకానంద 164 జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా భద్రాచలం బ్రేక్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 12న భారతదేశం లో స్వామి వివేకానంద జయంతి ని జాతీయ యువజన దినోత్సవంగా ఘనంగా కారుపుకుంటారు దేశ వ్యాప్తంగా పాఠశాలలు కళాశాలలో యువజన సంఘాలు ఆయన జీవితం బోధనలు స్ఫూర్తిగా తీసుకుని దేశభక్తి సేవాభావంగా కార్యక్రమాలు నిర్వహిస్తారు అని అన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మారుతి కాలేజ్ ఛైర్మన్ డాక్టర్ ఎస్ ఎల్ కాంతారావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి గా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో తాళ్ళూరి పంచాక్షరయ్య బీజేపీ నాయకులు కుంజా ధర్మ వివిధ నాయకులు పాల్గొన్నారు

## సేవా కార్యక్రమాలకు గుర్తింపు



**పలమనేరు నియోజకవర్గం, జనవరి 12, సి కే న్యూస్.**పలమనేర్లో పగడాల మధుమోహన్రావు చిరపరిచితులే. చిన్న చిన్న సేవా కార్యక్రమాలు చేస్తూ... విద్యను, స్పోర్ట్స్ ను ప్రోత్సహిస్తూ.... ఈ మధ్యనే గడచిన ఆరు నెలల నుండి 15 మంది పిల్లలకు వారి ఇంటి వద్దకు వెళ్లి మెమెంటో షాల్ పూలగుచ్ఛం ఇచ్చి ప్రోత్సహిస్తూ.....

ఆయన సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ... తిరుపతి లో మార్ప్ కల్చరల్ అకాడమీ వారు నిన్న నిర్వహించిన, జానపద కళల పరిరక్షణ మరియు సంఘ సేవకులను, వేమన విజ్ఞాన కేంద్రం, యశోద నగర్, తిరుపతి నందు,' మార్పు' కల్చరల్ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు దళవాయి గుర్రప్ప నాయుడు , కాపుగుంట రాజేంద్ర శెట్టి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు, డాక్టర్ ఎం సి రెడ్డప్పరెడ్డి అఖిల భారత బహుజన విద్య అభివృద్ధి సంస్థ, డాక్టర్ రమేష్ నాథ్ చైర్మన్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్, వీరి ద్వారా.... పలమనేరు సామాజిక సేవా కార్యకర్త మధుమోహన్రావును సన్మానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జానపద కళలు, సంస్కృతి, సాంప్రదాయాలు దేశంలో వెల్లివిరియాలని, జానపద కళల పరిరక్షణ ధ్యేయంగా ఉండాలని పలువురు వక్తలు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో, జిల్లా నలుమూలల నుండి నుండి వచ్చిన కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**సి కె న్యూస్ ఆత్మకూర్ యం రిపోర్టర్ శైక్ అజీజ్:**స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పల్లెర్ల గ్రామ సెంటర్ దగ్గర ఏబీవీపీ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న సర్పంచ్ తండ మంజుల నర్సింహా గౌడ్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొనందుకు చాలా సంతోషంగా ఉందని వివేకనంద ఒక గొప్ప మహోన్నతమైన వ్యక్తి అని భారత దేశ ఖ్యాతిని అమెరికా,ఇంగ్లాండ్ వంటి దేశాలకు ప్రసంగాల ద్వారా పరిచయం చేసిన ఘనత వారికే దక్కుతుందని,యువత వారిని స్ఫూర్తితో ముందుకెళ్లాలని అన్నారు అనంతరం సంక్రాతి పండగ సందర్భంగా భోగి రోజున యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుంద పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు కృష్ణ మణికాంత్ నాయకులు మల్లారెడ్డి వెంకటేశం మల్లయ్య ఎల్లయ్య యాదయ్య వెంకన్న రాజు నరేష్ మల్లేష్ గోపినాథ్ హరీష్ ఉపేందర్ శివారెడ్డి మచ్చగిరి కిరణ్ మధు శివమణి తదితరులు పాల్గొన్నారు

## శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ యువజన దినోత్సవం




**సి కె న్యూస్ ఆత్మకూర్ యం రిపోర్టర్ శైక్ అజీజ్:**భారతీయ యువతకు స్ఫూర్తి ప్రదాత శ్రీ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని మండల కేంద్రంలో శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది...ఈ కార్యక్రమంలో యువజన మండలి అధ్యక్షులు మజ్జిగ నరేశ్, ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్ గౌడ్, యాస ఇంద్రారెడ్డి వార్డ్ సభ్యులు కొంగరి పుష్పలత--పరశు రాములు, తవిటి శైలజ రాజు, రంగ సంధ్యారాణి--శ్రీనివాస్, బూడిద శేఖర్, ఎలగందుల సైదులు, కూరెళ్ల అనిల్, గట్టు విశాల్, రాగటి మచ్చగిరి యువజన మండలి సభ్యులు కోరే అయ్యాలం, కోరే కుమార్, మజ్జిగ రాంబాబు, ఉగ్గె నరేష్, బండ శివాజీ, మల్ల క్రాంతి, పంజాల వివేకానంద, కోరే మహేష్, లోడి మహేష్, మరాఠీ శివ, కోరే హరీష్, డబ్బేటి శివ, లోడి ప్రదీప్, మరాఠీ దుర్గరాజు, బుషిగంపల లోకేష్ తదితరులు పాల్గొన్నారు...

## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య క్యాలెండర్ ఆవిష్కరణ



**సి కె న్యూస్ ఆత్మకూర్(ఎం)రిపోర్టర్ శైక్ అజీజ్:**ఆత్మకూరు ఎం మండల కేంద్రంలో 12వ వార్డు లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య క్యాలెండర్ పంపిణి చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో 12 వార్డు మెంబర్ కూరెళ్ల అనిల్ ఇందిరమ్మ కమిటీ మెంబర్ వేముల గణేష్ ఎన్ ఎస్ యు ఐ యూత్ కాంగ్రెస్ నాయకులు గట్టు శేఖర్ మామిడి అనిల్ బద్దుల వెంకటేష్ కొంగరి విద్యాసాగర్ సూరారం శ్రీకాంత్ బొడ్డు ప్రభాకర్ గట్టు విజయ్ బద్దుల లక్ష్మణ్ కదిరే లక్ష్మణ్ దుర్గ ప్రసాద్ మధు తదితరులు పాల్గొన్నారు

## సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని తాసిల్ గ్రౌండ్ వద్ద నిర్వహించిన మోడీ క్రికెట్ కప్ టోర్నమెంట్ - సీజన్ 3 ఘనంగా జరిగింది.

**జనవరి (12) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి.**

మాజీ ఎమ్మెల్యే ఎం. విజయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్లో ఉత్కంఠభరితమైన మ్యాచ్లు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మ్యాచ్లో అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడికి 'మ్యాన్ ఆఫ్ ది లీగ్ మ్యాచ్ణ అవార్డును హెచ్ ఎం టీవీ రిపోర్టర్ ఎం ఏ హలీం అందజేశారు.

ఈ టోర్నమెంట్ ద్వారా యువతలో క్రీడాప్రతిభను ప్రోత్సహించడం తో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు



## ప్రజా దర్బార్ క్యాలెండర్ ని ఆవిష్కరించిన మండల తాసిల్దార్ బాబ్జి ప్రసాద్, ఎస్సై వీరేందర్...



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**

ప్రజా దర్బార్ క్యాలెండర్ ను మండల తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, ఎస్సై వీరేందర్ సోమవారం ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచిని స్వీకరించుతూ చెడును తొలగించడం కోసం జర్నలిస్టులు కృషి చేయాలని ఆయన కోరినారు. ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకుని వచ్చేది కూడా జర్నలిస్ట్ లేనని ఆయన కొనియాడారు. అలాగే ప్రజా దర్బార్ యాజమాన్యానికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు ఈకార్యక్రమంలో చింతకాని గ్రామ సర్పంచ్ కిలారి మనోహర్ బాబు, మండల వైద్యాధికారి మహమ్మద్ ఆల్తాఫ్, మండల సిపిఎం నాయకులు వత్సవాయి జానకి రాములు, మండల ప్రజా దర్బార్ రిపోర్టర్ గడ్డంవిజయ్ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల నివాళులు.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**నాగులవంచ గ్రామంలోని తోటకూరి తోటకూరి కోటయ్య , అన్నే పోగు విక్టోరియా దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమాని వంకాయలపాటి లచ్చయ్య, వంకాయలపాటి సత్యనారాయణ సామినేని బాబురావు ,కొల్లి బాబు , అంబటిసైదేశ్వరావు, అంబటి సత్యం, వంకాయలపాటిశివ, బట్టు తిరుపతిరావు ముప్పిడి వెంకన్న , గంధం నాగార్జున్ రావు. తదితరులు పాల్గొన్నారు




## సింగరేణి ఒప్పంద కార్మికులకు సి యం పి యఫ్ ఖాతా పాస్ బుక్ ల పంపిణీ...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 12,**సోమవారం కొత్తగూడెం సివిల్ డిపార్ట్మెంట్ నందు నిర్వహించిన కార్యక్రమం లో సింగరేణి కార్పొరేట్ ఏరియాలో పనిచేయుచున్న ఒప్పంద కార్మికులకు సంబందించి 2023-24 సంవత్సరం వరకు వారి వారి సి.యం.పి.యఫ్ ఖాతా నందు జమ అయిన డబ్బులకు సంబంధించిన సి.యం.పి.యఫ్ ఖాతా పాస్ బుక్ లను ఒప్పంద కార్మికులకు పంపిణీ చేశారు. జిఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్-1 కే.వంశీధర్ కుసుంభ విశిష్ట అతిధులుగా సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ ఎం.కనకమ్మ, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ హాజరై ఒప్పంద కార్మికులకు సి.యం.పి.యఫ్ ఖాతా(2023-24) పాస్ బుక్ లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒప్పంద కార్మికులు అందరూ కూడా సి.యం.పి.యఫ్ రికవరీ అయ్యే విధంగా చూసుకోవాలని దానివల్ల కలిగే ప్రయోజనాలు ప్రతి ఉద్యోగి తెలుసుకోవాలని, ఎట్టి పరిస్థితిలోనూ సిఎంపిఎఫ్ ను విత్ డ్రా చేసుకోవద్దని, క్రమం తప్పకుండా 10 సంవత్సరాలు సిఎంపిఎఫ్ ఉద్యోగుల ఖాతా నందు జమ అయితే వారికి వారి కుటుంభ సభ్యులకు పెన్షన్ సదుపాయం ఉంటుంది అని, భవిష్యత్తులో సి.యం.పి.యఫ్ ఖాతా నందు ఉన్న మొత్తము ఉద్యోగులు తెలుసుకునే విధంగా నూతన విధానాలను కూడా తీసుకువస్తున్నామని, త్వరలో 2024-25 సంవత్సరానికి సంబందించిన సిఎంపిఎఫ్ వివరాలను కూడా పాస్ బుక్స్ లో నమోదు చేసి ఇస్తామని తెలిపారు. జిఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం లో సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్-1 కే.వంశీధర్ కుసుంభ, సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ ఎం.కనకమ్మ, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, సిఎంపిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ పి.చిరంజీవి, డిజిఎం(. పర్సనల్) ఐఆర్ వింగ్ వై.వి.ఎల్.వరప్రసాద్, ఎస్ఈ సివిల్) పి.రాజేంద్ర ప్రసాద్, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి. రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్టియూసి) వైస్ ప్రెసిడెంట్ ఎస్. పితాంబర రావు,సిఎంపిఎఫ్ నుండి వి.సులోచన, వెంకటేశ్వర్లు, ఆసిస్టంట్ సూపరింటెండెంట్ ఏవి రమేష్ తో పాటు సివిల్ డిపార్ట్మెంట్ అధికారులు, ఉద్యోగులు ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు .

## జూనియర్ జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికైన తెలంగాణ ముద్దుబిడ్డ పోలేపాక నాగేంద్ర



**సీకే న్యూస్ జనవరి 12 ఆదివారం వరంగల్ జిల్లా, వరంగల్ మండలం ప్రతినిధి కమలాకర్:**వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో ఈ నెల 23 నుండి, 26 జరగబోయే జూనియర్ జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైన సందర్భంగా పోలేపాక నాగేంద్ర ,తండ్రి పోలేపాక రాములు కు అభినందనలు తెలియా చేస్తున్న వరంగల్ వేస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపి కావ్య హర్షం వ్యక్తం చేశారు.పోలేపాక రాములు తనయుడు పోలెపాక నాగేంద్ర ను కాయ కష్టం చేసి ఉన్నత విద్య కోసం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ లో బి ఎ ఫైనల్ ఇయర్ చదువుపిస్తూ, తన తనయుణ్ణి క్రీడారంగంలో నైపుణ్యం సాధించేటట్లు మలచి, మట్టిలో మాణిక్యంలాగా చేసి మన తెలంగాణ రాష్ట్రం నుండి వేస్ట్ బెంగాల్లో జరుగుతున్న పోటీలకు పంపిస్తున్నారు, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం చదివే కాకుండా, క్రీడా నైపుణ్యం పెంచే విధంగా తమ వంతు సహాయ సహకారాలను తల్లిదండ్రులు అందించాలి.అదే తల్లిదండ్రుల దృఢ సంకల్పం అన్నారు.

## బీజేపీ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు కిషన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండల అధ్యక్షులు కొండా గోపి గారు బిజెపి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు కిషన్ రెడ్డి గారిని, కలిసి చింతకాని మండలంలో బిజెపి కార్యకర్తల వారి వ్యక్తిగత పనులపై కలవడం జరిగింది. వెంటనే స్పందించి ఆ పనులను కిషన్ రెడ్డి గారు వారి వ్యక్తిగత సిబ్బందికి చెప్పి ఆ పనులను పూర్తి అయ్యేాల వివరించడం జరిగింది. అలాగే బిజెపి పార్టీ బలోపితం కోసం కృషి చేయాలని వారు సూచన చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పామర్తి శ్రీను, యువమోర్చ నాయకులు సత్తెనపల్లి గోపి, గోదాప్రసాద్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు స్లాప్ నిర్మాణం కార్యక్రమం లో: కాంగ్రెస్ పార్టీ నాయకులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** జగన్నాధపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టుతున్న ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లింగ సైదా& ఆశ. దంపతుల ఇల్లు స్లాప్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమానికి. జగన్నాధపురం గ్రామ సర్పంచ్. తాళ్లూరి స్వప్న. రమేష్. గ్రామ పంచాయతీ కార్యదర్శి. కృష్ణమాచారి. గ్రామ శాఖ అధ్యక్షుడు అరువురి వెంకటేశ్వర్లు. ఫీల్డ్ అసిస్టెంట్ నాగలక్ష్మి. అలవాల వెంకటేశ్వర్లు. గమ్మిడి ప్రసాద్. రాని హసేన్. తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద జయంతి, వేడుకలు ఘనంగా

**జనవరి 12 (సీ కే న్యూస్) చేగుంట/** సోమవారం నాడు చేగుంట మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో చేగుంట సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు, సీనియర్ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు అందరూ కలిసి గాంధీ చౌరస్తా వద్ద స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని కేక్ కట్ చేసినారు. అనంతరం వివేకానంద స్వామి జయంతి సందర్భంగా పెన్నులు పంచినారు. అనంతరం ఆయన గురించి మాట్లాడుతూ భారతదేశానికి గొప్ప గురువు, ఆధ్యాత్మిక నాయకుడు, రామకృష్ణ పరమహంస శిష్యుడు. 1893లో చికాగోలో జరిగిన ప్రపంచ మత సమ్మేళనంలో భారతదేశం గురించి ప్రసంగించి ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీక్, వార్డ్ మెంబర్లు సాయిబాబా, రవి, సీనియర్ నాయకులు చింతల భూపాల్, రిటైర్డ్ ఉద్యోగి తాళ్లపల్లి రాజేశ్వర్, నరేష్ శ్రీకాంత్ తదితరులు అందరు పాల్గొన్నారు.



# ముగ్గుల మురిపెం.. సంక్రాంతి సంబరం!







- ఏదులాపురంలో అట్టహాసంగా 'ముగ్గుల పోటీలు'
- తండోపతండాలుగా తరలివచ్చిన 825 మంది ఆడపడుచులు
- సృజనాత్మకతకు అద్దం పట్టిన రంగురంగుల రంగవల్లులు
- విజేతలకు బహుమతులు అందజేసిన మంత్రి పొంగులేటి దంపతులు, ఎంపీ రఘురాం రెడ్డి
- వృద్ధురాలి ఉత్సాహానికి మంత్రి ఫిదా.. ప్రత్యేక నగదు పురస్కారం

**సికె న్యూస్ ప్రతినిధి ఏదులాపురం** : తెలుగు లోగిళ్లలో సంక్రాంతి వెలుగులు ముందే వచ్చాయి. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు కనులవిందుగా సాగాయి. మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సాయి ప్రభాత్ నగర్‌లో జరిగిన ఈ మెగా పోటీలకు మహిళా లోకం పోటెత్తింది. ఏకంగా 825 మంది మహిళలు రంగురంగుల రంగవల్లులతో ఏదులాపురం వీధులను ఇంద్రధనుస్సులా మార్చేశారు.

అబ్బురపరిచిన సృజనాత్మకత

మహిళలు కేవలం ముగ్గులు వేయడమే కాకుండా, వాటిలో సామాజిక అంశాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను చొప్పించి తమ సృజనాత్మకతను చాటారు. రైతన్నకు భరోసా, మహిళా రక్షణ వంటి అంశాలను ప్రతిబింబించేలా వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

విజేతలకు 'నగదు' కానుకలు

పోటీలో ప్రతిభ కనబరిచిన విజేతలకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయన సతీమణి పొంగులేటి మాధురి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు.
ప్రథమ బహుమతి: లక్ష్మీప్రసన్న (రూ. 30,000), ద్వితీయ బహుమతి: ఎన్. విజయ (రూ. 25,000), తృతీయ బహుమతి: కె. నిర్మల (రూ. 20,000), నాల్గవ, ఐదవ: వి. నాగమణి (15వేలు), వి. రమాదేవి (10వేలు), 6 నుంచి 10 స్థానాల్లో నిలిచిన వారికి తలా రూ. 5,000 అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... "మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ అందరి ఆశీస్సులు కోరుకుంటున్నాను. ఈ ముగ్గుల పోటీలు మన సంస్కృతికి అద్దం పడుతున్నాయి. 80 ఏళ్లు దాటిన వృద్ధురాలు కూడా ఈ వయస్సులో పోటీలో పాల్గొనడం చాలా గొప్ప విషయమని ప్రశంసిస్తూ ఆమెకు ప్రత్యేకంగా రూ. 2 వేలు బహుమతిగా ఇచ్చారు. 11 నుంచి 20 స్థానాల వారికి రూ. 2వేలు చొప్పున, 21 నుంచి 30 స్థానాల వారికి ప్రత్యేక బహుమతులు అందజేయడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు.





## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి... అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్**

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి -13:** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు.
కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ప్రజల అర్జీలను స్వీకరించారు.
ఖమ్మం సారధి నగర్ కు చెందిన ఎస్.కే. అతిర్ 48వ డివిజన్ పరిధిలో తమ ఇంటి ప్రక్కన అనధికారీకంగా కారం, పిండీ మిల్లు నడుపుతున్నారని, దీనివల్ల తమ ఇంట్లో కుటుంబ సభ్యులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, కాలనీ యందు ఉన్న ఈ మిల్లును మార్చాలని దరఖాస్తు చేసుకోగా, ఈఈ పీసీబీకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.
వైరా పట్టణం శాంతినగర్ కు చెందిన కే. వేంకటేశ్వర్లు తనకు 69 సంవత్సరాల వయస్సు ఉందని, వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.
సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామానికి చెందిన కే. రమేష్ సిద్ధారం గ్రామానికి సంబంధించిన రేషన్ షాప్ డీలర్ పోస్ట్ ఖాళీగా ఉన్నట్టు తెలిసిందని, తనకు అర్హత ఉన్నందున ఆ పోస్ట్ మంజూరు చేయాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కల్లూరు సబ్ కలెక్టర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.
మధిర మండలం చిలుకూరి గ్రామ నివాసులు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపును రద్దు చేయాలని దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.



ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## మంచుకొండ ఎత్తిపోతల పథకం ప్రారంభానికి రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలి...



- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- రైతులు లాభ సాటి ఆయిల్ పంప్ పంట సాగు వైపు దృష్టి సారించాలి
- రాములుతండా నుంచి చింతగుర్తి కొర్లబోడు తండా క్రాస్ రోడ్డు వరకు 2.5 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

**సికె న్యూస్ ప్రతినిధి రఘునాథపాలెం, జనవరి- 13:** మంచుకొండ ఎత్తిపోతల పథకం ప్రారంభానికి రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
మంత్రి, సోమవారం రఘునాథపాలెం మండలంలో రాములు తండా నుంచి చింతగుర్తి కొర్లబోడు తండా క్రాస్ రోడ్డు వరకు 2.5 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామానికి 10 లక్షల రూపాయల గ్రాంట్ అందిస్తామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట మేరకు గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.
మహిళలకు ప్రభుత్వం నాణ్యమైన చీరలను ఉచితంగా పంపిణీ చేసిందని, పెద్ద వయస్సు గల మహిళలకు ప్రత్యేకమైన డిజైన్ అందించామని అన్నారు. సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.
రైతులకు సాగునీరు అందించేందుకు చేపట్టిన మంచుకొండ ఎత్తిపోతల పథకం పూర్తయిందని, ఆ ప్రాజెక్టు క్రింద నీళ్ళు వదిలే కార్యక్రమానికి రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని మంత్రి పిలుపు నిచ్చారు. మండలంలో 3వ పంటకు సైతం సాగునీరు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, రైతులు పెద్ద ఎత్తున పామాయిల్ పంట సాగు చేయాలని అన్నారు.
ఆయిల్ పామ్ పంటతో రైతులకు మంచి లాభాలు వస్తాయని, అంతర్ పంటల క్రింద కూర గాయలు, పత్తి, పప్పులు సాగు చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి రఘునాథపాలెం మండలంలో రోడ్లు వేయిస్తుందని అన్నారు. మండలంలో రోడ్డు కనెక్టివిటీ పెరగడం వల్ల ప్రజలందరికీ చాలా ఉపయోగం జరుగుతుందని తెలిపారు.
2.5 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను గ్రామస్తులు రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తూ ఎక్కడ ఎటువంటి పొరపాటు జరిగిన సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని రావాలని అదనపు కలెక్టర్ అన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, రాములు తాండ సర్పంచ్ బానోతు వెంకట్రాం, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగ ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని,

**ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి**



**జనవరి 12 సీ కే న్యూస్ చేగుంట:** ముందుగా చేగుంట మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు, చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి, సంక్రాంతి పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలనీ తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగకు సొంత ఇళ్లకు ఇతర ప్రాంతాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రయాణాలు చేస్తున్న నేపథ్యంలో ఇళ్లలో దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి ప్రజలకు సూచించారు. పండుగ సెలవుల్లో ఇళ్లు ఖాళీగా ఉండటాన్ని దుండగులు ఆసరాగా చేసుకుని చోరీలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని ఆయన హెచ్చరించారు. ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లే వారు భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని, విలువైన నగలు, నగదును ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచాలని వారు సూచించారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా చలనం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పండుగను దృష్టిలో ఉంచుకుని పట్టణాలు, గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పెట్రోలింగ్‌ను పెంచినట్లు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే దొంగతనాలను సమర్థవంతంగా నివారించవచ్చని ఎస్ ఐ ఆశాభావం వ్యక్తం చేశారు, మండలం లో ఎవరైనా అక్రమంగా చైనా మాంజ విక్రయించిన, అమ్మిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు, గాలి పటాలు ఎగరవేస్తున్న సమయంలో పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి ఇళ్లపైకి వెక్కి గాలిపటం వదలడం జరుగుతుంది కాబట్టి ఎక్కడైనా గాలిపటాలు కరెంట్ వైరులకు తగిలితే అప్రమత్తంగా ఉండాలి, పిల్లల పై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని వారు కోరారు,

## 60 డివిజన్ల తుది ఓటర్ల జాబితా విడుదల



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 12,** భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో తెలంగాణ మున్సిపాలిటిల చట్టం 2019లోని సెక్షన్ 11 , 12 ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారి చేసిన ఆదేశాలకు అనుగుణంగా, నగరపాలక సంస్థ, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని 60 డివిజన్ లకు సంభందించిన తుది ఓటర్ల జాబితా (డివిజన్ వారిగా) ను12 జనవరి 2026నాడు ప్రచురించడం జరిగినదని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత తెలియజేయడమైనది. ఈ తుది ఓటర్ల జాబితా నగరపాలక సంస్థ కొత్తగూడెం కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం, రెవిన్యూ డివిజనల్ కార్యాలయం మరియు అదనపు కలెక్టర్ (ఎల్బిఎస్ ) కార్యాలయములో అందుబాటులో కలవు. కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలోని మొత్తం 60 డివిజన్ సంభందించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య ఈ విధంగా ఉంది: మహిళలు 70,314 పురుషులు64,431 ఇతరులు 30 మొత్తం ఓటర్లు 1,34,775 మంది ఉన్నారని మున్సిపల్ కమీషనర్ నగరపాలకసంస్థ కొత్తగూడెం కమిషనర్ సుజాత తెలిపారు

## వెల్వేర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడాలు ప్రారంభోత్సవం..

- ప్రారంభకులు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.
- కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో.









**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 12.**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలివేర్తి గ్రామంలో యూత్ అధ్యక్షులు కుసుమల్ల సుధాకర్ మరియు కమిటీ సభ్యుల సమక్షంలో సంక్రాంతి క్రీడల ప్రారంభోత్సవం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై ప్రారంభించారు.
మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు అధిక సంఖ్యలో ఆటల పోటీలలో పాల్గొని సంక్రాంతి సంబరాలు మంచి వాతావరణంలో జరుపుకోవాలని ఆటల పోటీలో ముందంజలో యువకులు ఉండాలని
క్రీడా మైదానానికి సంబంధించిన అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానని ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేయిస్తానని, హెల్త్ సెంటర్ ను సందర్శించి 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా డాక్టర్ను ఏర్పాటు చేపిస్తానని,గ్రామ ప్రజలకు హామీ ఇచ్చినారు, గ్రామ పెద్దలు రమణ సారు గ్రామ శాఖ అధ్యక్షులు ఉక్కుర్తి స్వామి ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానం చేసి డబ్బు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికినారు,ఎమ్మెల్యే గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపినారు, ఈ కార్యక్రమంలో మండల నాయకులు మరియు వెల్వర్తి గ్రామ నాయకులు యువకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర చైర్మన్ శ్రీ నూతి శ్రీకాంత్ గౌడ్ ని కలిసిన కాంగ్రెస్ నాయకులు



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.,తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ చైర్మన్, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ శ్రీ నూతి శ్రీకాంత్ గౌడ్ ని హైదరాబాద్ లోని వారి ఆఫీస్ నందు మరియాదపూర్వకంగా కలిసిన చిన్నమండవ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరీదు రామకృష్ణ గౌడ్ , అనంతరం విద్యావిధానాల గురించి మాట్లాడుకున్న ఇద్దరు యువనాయకులు, ఎల్లవేళలా తోడుగా ఉంటానని హామీ ఇచ్చిన యువ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్

## పుట్ట వెంకటేశ్వరరావుకు పార్థవదేహానికి పూలు వేసి నివాళులర్పించిన బీసీ జెఎసి ఉద్యమ నాయకులు.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన పుట్ట వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మరణించారు ఈ మరణవార్త వినగానే హైదరాబాదులో నుండి బయలుదేరి బీసీ జేఏసీ ఉద్యమంలో పనిచేస్తున్న మా గ్రామం బీసీ ముద్దుబిడ్డ ఓయూ విద్యార్థి కార్యకర్త గోదా రవీందర్ పుట్ట వెంకటేశ్వర్లు కి పార్థివ దేహానికిపూలు వేసి నివాళులు అర్పిస్తూ "వారి ఆత్మకు శాంతి కలగాలని,భగవంతుడు కుటుంబ సభ్యులకు ధైర్యమివ్వాలి," "వారి మరణం మాకు తీరని లోటు. వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేశారువారి కుటుంబానికి ఎల్లవేళలా తోడుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, ఉపసర్పంచ్ గోగుల నాగమణి,వంకాయలపాటి లచ్చయ్య, బండి రామారావు, గోగుల నరసింహారావు , ఐతం దేవేంద్ర,ఐతం రమేష్,ఐతం శీను, మడిపల్లి మంగారావు,గోదారాధమ్మ నాన్నయ్య, గోదావెంకన్న, గోగుల నాగరాజు సూర్ణకంటినాగేశ్వరావు, మరీదు మధు,చాపలమడుగు పెద్దబ్బాయి, చాపలమడుగు జోగయ్య తదితరులు పాల్గొన్నారు!

## తోటకూరి కోటయ్య దశదిన కార్యక్రమములో పాల్గొన్న సిపిఎం పార్టీ నాయకులు.




సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి :నాగులవంచ గ్రామం తోటకూరి కోటయ్యదశ దిన కార్యక్రమం సందర్భంగా కోటయ్య కి నివాళులర్పించిన సిపిఎం సీనియర్ నాయకులు మునుకుంట్ల సుబ్బారావు తోటకూర వెంకట నరసయ్య కందరబోయిన కొండలరావు రౌతు అప్పారావు కంభం శ్రీనివాసరావు బైరు రామయ్య మంకెన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు..

- పట్టణ ఎస్ఐ శ్యాంప్రసాద్..
- ఫుట్ పాత్ వ్యాపారులకు కౌన్సిలింగ్ నిర్వహించిన పట్టణ పోలీస్ బృందం...




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 12, భద్రాచలం రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న పండ్ల, పూల చిరు వ్యాపారులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనదారులకు ఇబ్బందులు కలిగించకుండా నిబ్బందుల ప్రకారం తగు జాగ్రత్తలు తీసుకొని వ్యాపారాలు కొనసాగించాలని పట్టణ ఎస్సై శ్యాంప్రసాద్ చిరు వ్యాపారులను ఆదేశించారు. సోమవారం పట్టణ సిఐ నాగరాజు ఆదేశానుసారం ఫారెస్ట్ ఆఫీసు ఎదురుగా ఉన్నటువంటి పండ్ల దుకాణాల యజమానులకు వర్కర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పండ్లు పూలు కొనుగోలు చేసుకునే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుకు పక్కన నిలిపే విధంగా వ్యాపారులే సూచనలు చేయాలని అన్నారు. ఫుట్ పాత్ పై నడిచే పాదాచార్యులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత తమపైనే ఉందని స్పష్టం చేశారు. భద్రాచలంలో అంతకంతకు ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో ఫుట్పాత్ వ్యాపారులు రోడ్లను ఆక్రమిస్తే వాహనదారులకు పాదాచార్యులకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని అన్నారు. ఫుట్పాత్ వ్యాపారులు నిబ్బందులు అతిక్రమించి రోడ్లమీదకు వచ్చి వ్యాపారాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులకు ఫుట్పాత్ వ్యాపారులు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని వారి సూచనలను తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు.

# సాగు ఖర్చులు తగ్గుతూ రైతులకు ఆదాయం పెరగాలి...

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- రైతులు అవసరం మేరకే యూరియా వినియోగించాలి
- భూసారం కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత
- చింతగుర్తి గ్రామంలో బేయర్స్ కంపెనీ వ్యవసాయ డ్రోన్ లను ప్రారంభించిన మంత్రి తుమ్మల




సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం/ రఘునాథపాలెం, జనవరి 13: సాగు ఖర్చులు తగ్గుతూ ఆదాయం పెరిగేలా నూతన పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

మంత్రి, సోమవారం రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామంలో బేయర్స్ కంపెనీ వ్యవసాయ డ్రోన్ లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ వ్యవసాయ డ్రోన్ వినియోగించి పురుగుల మందులు మోతాదులో మాత్రమే చల్లడం ద్వారా భూసారం పెరుగుతుందని, యూరియా వినియోగం తగ్గుతుందని పంటల దిగుబడులు పెరుగుతాయని తెలిపారు.

కెమికల్స్ ఉన్న ఎరువులు వాడకం అధికం కావడం వల్ల పురుగుల మందులు అవసరం ఉంటుందని, రైతులు క్రమ పద్ధతిలో సహజ పద్ధతులలో సాగు చేయడం వైపు దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. బోగస్ కంపెనీలు హెచ్.డి. విత్తనాల పేరిట నకిలీ విత్తనాలు రైతులకు అందించడం వల్ల చాలా నష్టపోతున్నారని మంత్రి తెలిపారు.

వ్యవసాయ డ్రోన్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు శిక్షణ అందించి, వారికి సబ్సిడీపై అందించే ఆలోచన ప్రభుత్వం చేస్తుందని అన్నారు. శాటిలైట్ వినియోగించుకుంటూ తెగులు ఎక్కడ ఉందో గుర్తించి అక్కడ మాత్రమే పురుగుల మందు వినియోగించేలా పైలెట్ ప్రాజెక్టు అగ్రి వాస్ కంపెనీతో అమలు చేస్తున్నామని అన్నారు.

మన పంట పొలాల ఆరోగ్య పరిస్థితిల గురించి రైతులు తెలుసుకోవాలని అన్నారు. సాయిల్ టెస్టింగ్ రికార్డులను అప్ డేట్ చేస్తూ ప్రతి రైతుకు వివరాలు అందించే విధానం ప్రవేశపెడుతున్నామని అన్నారు. రైతులు వ్యవసాయ ఖర్చులు తగ్గించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

పంట నాట్లు వేయడం, పురుగుల మందు చల్లడం వంటి అనేక రకాలుగా వ్యవసాయ డ్రోన్ వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు అధికంగా యూరియా వాడితే పంట పండే శక్తి భూమి కోల్పోతుందని, దీనిని రైతులు దృష్టిలో ఉంచుకోవాలని, ప్రతి రైతు తమ భూమి యొక్క ఆరోగ్య పరిస్థితి మెరుగు పర్చుకోవాలని అన్నారు.

రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని, కొంతమంది రైతులు ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల యూరియా వినియోగిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇదే పద్ధతి కొనసాగిస్తే భవిష్యత్తులో ఆ భూములలో గడ్డి కూడా మొలవదని, రైతులను నాశనం చేసే రాజకీయాలు మనకు అవసరం లేదని అన్నారు.

ఎరువుల ధరలు క్రమబద్ధీకరణ ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగిందని, కాంప్లెక్స్ ధర 1800,యూరియా ధర 260 ఉండటంతో అధికంగా యూరియా వాడటం జరుగుతుందని అన్నారు. రైతులు యూరియా అవసరానికి మించి వినియోగించకుండా అధికారులు ఎప్పటి కప్పుడు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

మన దగ్గర చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉంటారని, వారికి అనుగుణంగా వ్యవసాయ సాంకేతికత వచ్చే విధంగా కంపెనీలు కృషి చేయాలని మంత్రి తెలిపారు. వరి, పత్తి, మిర్చి పంటల సాగులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో కొనసాగుతుందని, భవిష్యత్తులో మన భూమి భూసారం కోల్పోకుండా కాపాడుకుంటూ వ్యవసాయం కొనసాగించాలని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా పంట దిగుబడులు పెరుగుతున్నాయని అన్నారు. వ్యవసాయ సాగులో యూరియా, పురుగుల మందు వాడకం చాలా తగ్గించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

డ్రోన్ ల ద్వారా వ్యవసాయ రంగంలో ఎటువంటి లాభాలు ఉంటాయి అనే అంశాలను రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. డ్రోన్ వినియోగం ద్వారా కూలీల కొరత సమస్య తగ్గుతుందని, ఎంత అవసరమో అంతే యూరియా పొలాల్లో వాడటం వల్ల మన భూముల సారం పెరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, చింతగుర్తి సర్పంచ్ ప్రియాంక, బైయర్ కంపెనీ ప్రతినిధులు నాయుడు, శివానంద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.




సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 12. న్యాయవాదుల సమస్యలపై పనిచేసే ఐలు అభ్యర్థుల ను గెలిపించాలి ఐలు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి

న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, న్యాయవాదుల సమస్యలపై నిరంతరం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు అభ్యర్థులు మందడపు శ్రీనివాసరావు గా చీ160, సిహెచ్ శైలజ గా చీ 135, లను జనవరి 30న జరిగే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలలో అత్యధిక మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి ఎన్నుకోవాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి భువనగిరి జిల్లా కోర్టు ఆవరణలో ప్రచార కార్యక్రమంలో పాల్గొని ప్రచారాన్ని నిర్వహించారు, అనంతరం మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు 10,000 ఉపకార వేతనం ఇవ్వాలని ఆయన కోరారు. సీనియర్ న్యాయవాదులు కల్లూరు రవీందర్ రెడ్డి, వంగేటి విజయభాస్కర్ రెడ్డి, మట్ట వెంకటేశ్వర్లు, భూపాల్ రెడ్డి కలిసి ఓట్లను అడగడం జరిగింది. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి కోర్టులు జిల్లాలో అన్ని కోర్టుల కు నూతన భవనాలను వెంటనే నిర్మించాలని ఆయన కోరారు అలాగే 36 సంవత్సరాలు దాటిన న్యాయవాదులకు ఏలాంటి షరతులు లేకుండా డబ్బులు లేకుండా వెల్ఫేర్ ఫండ్ లో సభ్యత్వం కల్పించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు)జిల్లా అధ్యక్షులు,బార్ ఆసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లెపల్లి కుమార్ జిల్లా సహాయ కార్యదర్శి సీస శ్రీనివాస్, చింతల రాజశేఖర్ రెడ్డి, జిట్టా భాస్కర్ రెడ్డి, ఆకుల మల్లేశం పిడుగు ఐలయ్య, నవీన్,మేడబోయిన యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధి,పంచాయితీ అభివృద్ధిలో కీలక పాత్ర సర్పంచ్ లదే.

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,
- తండా పంచాయితీని తండా అభివృద్ధి బోర్డుగా ఏర్పాటు చేయాలి.
- తండా పంచాయితీని రెవిన్యూ పంచాయితీగా గుర్తించాలి.
- ఏజెన్సీ చట్టాలను,జిఓ 3 స్థానంలో కొత్త జిఓ రావడంలో సర్పంచ్ లు భాగస్వామ్యం కావాలి.
- ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్,జీఎల్ఎస్ జాక్ చైర్మన్.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 12,గిరిజన లంబాడి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జి.ఎల్.ఎస్ జెఎసి ఆధ్వర్యంలో ఘనంగా గిరిజన లంబాడి సర్పంచ్-ఉప సర్పంచ్ ల సన్మాన మహోత్సవ అభినందన సభ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాని కి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు హాజరై మాట్లాడుతూ నూతన సర్పంచ్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి సర్పంచ్లు తండాల అభివృద్ధికి కృషి చేయాలని దేశ సమాగ్రాభివృద్ధి లో కీలక పాత్ర పోషించి గ్రామ పంచాయతీ లో పాలుపంచుకోవాలని ,ప్రతి సమస్యను దగ్గరుండి సమస్య పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని అన్నారు. ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ జాక్ చైర్మన్ మాట్లాడుతూ తండా పంచాయితీని తండా అభివృద్ధి బోర్డుగా ఏర్పాటు చేయాలని,తండా పంచాయితీని రెవిన్యూ పంచాయితీగా గుర్తించాలని, ఏజెన్సీ చట్టాలను,జిఓ 3 స్థానంలో కొత్త జిఓ రావడంలో సర్పంచ్ లు భాగస్వామ్యం కావాలని అన్నారు. గిరిజన చట్టాలైన పెస చట్టం పరిరక్షణ ఏజెన్సీలో 100 % రిజర్వేషన్ల విద్యా ఉద్యోగాల్లో గిరిజన్లో వాటా వారికి చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.గ్రామ పంచాయతీలోని యువత గంజాయికి బానిస కాకుండా చూడాలని గంజాయి మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ షాబీర్ భాష , రాష్ట్ర అధ్యక్షుడు గూగులోతు రాజేష్ నాయక్ .జాక్ సెక్రటరీ జనరల్ రమేష్,న్యాయవాది బానోత్ రమేష్ నాయక్ ,వైస్ ఛైర్మన్ లు లావుడియా ప్రసాద్ నాయక్, మాలోత్ విగ్నేష్ నాయక్, లాకావత్ వెంకటేశ్వర్లు, బట్టు జుంకీలాల్ నాయక్ , బోడా లాలు నాయక్ గూగులోతు కృష్ణ నాయక్, భూక్యా వెంకట్ నాయక్, హథీరాం నాయక్, జీ .శ్రీనివాస్ నాయక్, జేఏసీ అధికార ప్రతినిధిలు రవి రాథోడ్ ,లావూరి శ్రీనివాస్ నాయక్, చుంచుపల్లి మండలం మాజీ ఎం పీ పీ బాదావత్ శాంతి బాయి, బాదావత్ సీతారాం,ధరావత్ ప్రేమ్ చంద్ నాయక్ నాయక్ , జి ఎల్ ఎస్ – జేఏసీ కోశాధికారి మంగీలాల్ నాయక్, జనరల్ సెక్రటరీ మోహన్ నాయక్, గూగులోతూ దేవిలాల్ నాయక్, జాక్ ప్రధాన కార్యదర్శులు నువ్వునావత్ రాంబాబు నాయక్ ,సురేష్ నాయక్, దుర్గాప్రసాద్ నాయక్, నూనావత్ బాలాజీ నాయక్, బర్మావత్ హరి నాయక్, జరుపులా లచ్చు నాయక్, భూక్య లక్ష్మణ్, బిచ్చ నాయక్ , నాగేశ్వరరావు పాడియా, ఉపేందర్ నాయక్,జాయింట్ సెక్రటరీలు భూక్యా శ్రీను, భానోత్ సేవ్య నాయక్, బానోతు కిషన్ నాయక్, మాలోత్ బాలు, వంకుడోత్ రమేష్ బాబు, ధరావత్ నాగరాజు నాయక్ , ఆర్గనైజింగ్ సెక్రటరీలు శీను నాయక్ బాలు, నాయక్, సక్రూ నాయక్, లావుడియా పూర్ణ నాయక్, శ్రీనివాస్ నాయక్ రాజ్ కుమార్ నాయక్, రాంసింగ్ నాయక్, సురేష్ నాయక్, బాబురావు నాయక్, రూప్ల నాయక్, భట్టు హుస్సేన్ నాయక్, అనిల్ నాయక్, మీడియా సెక్రెటరీ పూర్ణచంద్ర నాయక్, వినోద్, నాగరాజు నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది లంబాడి సర్పంచులు ఉపసర్పంచ్లు పాల్గొన్నారు.వందల మంది లంబాడి ప్రముఖులు పాల్గొన్నారు.



## చింతకాని మండలం నాగిలిగొండా గ్రామంలో దారుణ ఘటన....



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి :చింతకాని మండల పరిధిలోని నాగిలిగొండా గ్రామంలో సోమవారం దారుణ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చాట్ల జాషువాను అదే గ్రామానికి చెందిన తోటపల్లి సుమంత్ కోడి కత్తితో పొడిచినట్లు సమాచారం. ఈ ఘటనలో జాషువాకు తీవ్ర గాయాలయ్యాయి అని తెలుస్తుంది. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు గాయపడిన జాషువాలో చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఘటనకు గల కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆత్మకూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం సంసద్ కేలో మహోత్సవం



సి కె న్యూస్ ఆత్మకూర్ యం రిపోర్టర్ షేక్ అజీజ్
పీఎం సంసద్ ఖేలో మహోత్సవంలి

లో భాగంగా ఈరోజు ఆత్మకూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారుల ఎన్రోల్మెంట్ ప్రక్రియను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గజరాజ్ కాశీనాథ్ ఆత్మకూర్ మండల ఎన్రోల్మెంట్ ఇన్చార్జిలు మజ్జిగ నరేష్ రాగటి మత్స్యగిరి గౌడ్ మరియు నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు దొంతర బోయిన మురళీకృష్ణ (చిన్న) యువజన సంఘం సభ్యులు మరియు క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.

# మహాత్ముని చివరి నిరాహార దీక్ష

భారత జాతిపిత మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో సార్లు నిరాహార దీక్షలు చేపట్టారు. అయితే గాంధీజీ స్వతంత్రం వచ్చిన తరువాత నిరాహారదీక్ష కూడా చేసారు. స్వాతంత్ర్యానంతరం గాంధీ ప్రయత్నాలు హిందూ - ముస్లిం విద్వేషాలను నివారించడానికి పరిమిత మయ్యాయి. ముస్లిం నాయకుడైన మహమ్మద్ ఆలీ జిన్నాను ప్రధాని మంత్రిగా చేసైనా దేశ విభజనను ఆపాలని గాంధీ భావించారు. ఇది హిందూ-ముస్లింల మధ్య మరింత చిచ్చు రాజేసింది. నెహ్రూ, సర్దార్ వల్లబాయ్ పటేల్ లు గాంధీ విధానాన్ని వ్యతిరేకించారు. విభజన జరిగితే నే అల్లర్లు సమసి పోతాయని వారు భావించారు. దేశ విభజనో..అంతర్గత యుద్ధమో తేల్చుకోండని జిన్నా పిలుపు నివ్వడం గాంధీని ఇరకాటంలో పడేసింది. 1947 ఆగస్టు 15న దేశ మంతా సంబరాలు జరుపు కుంటుంటే..గాంధీ మాత్రం కలకత్తాలోని ఒక హరిజన వాడన శుభ్రం చేస్తు గడపడం విశేషం.దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లు, అవి దారితీసిన ఉద్రిక్తతలు, మత ఘర్షణల ఫలితంగా అనూహ్యమైన రీతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు.
ప్రభుత్వం పరిస్థితిని అదుపు చేయలేని అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలు లలో పెద్దఎత్తున సంభవించిన వలసలవల్ల మత కలహాలు, మారణ కాండలు ప్రజ్వరిల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ - పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంటా, బయటా పరిస్థితి మరింత క్షీణించింది. ముస్లిము లందరినీ పాకిస్తాను పంపాలనీ, కలసి బ్రతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయిలోనే వినిపించ సాగాయి. ఈ పరిస్థితి గాంధీకి మింగుడు పడని అంశంగా మారింది. దీనికి తోడు విభజన ఒప్పందం ప్రకారము పాకిస్తానుకు ఇవ్వవలసిని 55 కోట్లు రూపాయలను ఇవ్వడానికి భారత ప్రభుత్వం నిరాకరించింది.
ఆ డబ్బు భారతదేశంపై పాకిస్తాన్ యుద్ధం చేస్తే యుద్ధానికి ఉపయోగ పడుతుందని సర్దార్ పటేల్ వంటి నాయకుల అభిప్రాయం. కాని అలా కాకుంటే పాకిస్తాన్ మరింత ఆందోళన చెందుతుందనీ, దేశాలమధ్య విరోధాలు ప్రబలి మతవిద్వేషాలు సరిహద్దులు దాటుతాయనీ, అంతర్యుద్ధానికి దారితీస్తుందనీ గాంధీజీ అభిప్రాయం.జనవరి 12, 1948. ఆ రోజు సాయంత్రం తన రోజువారీ ప్రార్థన సమావేశంలో, మరుసటి రోజు ఉదయం నుండి ఆమరణ ఉపవాసం కూర్చుంటానని గాంధీ ప్రకటించారు.1948 జనవరి 13న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు గాంధీజీ రెండు డిమాండ్లతో నిరాహార దీక్షలో కూర్చున్నారు. మొదటి డిమాండ్ పాకిస్తాన్‌కు భారత్ విభజన ఒప్పందంకు సంబంధించిన మిగిలిన రూ.55 కోట్లు ఇవ్వాలి. రెండోది ఢిల్లీలో ముస్లింలపై జరుగుతున్న దాడులు ఆగాలి. దీనికి ముందు గాంధీ తన రోజువారీ పనులను పూర్తి చేశారు. నెహ్రూ, పటేల్, ఆజాద్‌లతో ఆయన సుదీర్ఘ చర్చలు జరిపారు. కొంతమంది బిర్లా హౌస్ పచ్చిక బయళ్లలో గుమిగూడారు. 'వైష్ణవ జ న్ తో తేనె కహియే తో పాటు, ఆయనకు ఎంతో ప్రియమైన భజన్లను, శ్లోకాలను పాడారు. తర్వాత ఖురాన్ మరియు గురు గ్రంథ్ సాహిబ్ నుండి శ్లోకాలు పఠించ బడ్డాయి. ఇలా ఆయన ఢిల్లీలో తన చివరి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఎవరెంతగా ప్రాధేయపడినా ఆయన తన దీక్ష మానలేదు. చివరకు భారత ప్రభుత్వం దిగివచ్చి పాకిస్తానుకు 55 కోట్ల డబ్బు ఇవ్వడానికి అంగీకరించింది. 1948 జనవరి 18న ఒక శాంతి కమిటీ ఏర్పాటైంది. ముస్లింలు ఢిల్లీలోని తమ ఇళ్లలోకి వెళ్లవచ్చని, హిందువులు, సిక్కుల ఆక్రమణ నుంచి మసీదులను విడిపిస్తామని, అక్రమ కబ్జాల నుంచి ముస్లింల ప్రాంతాలను విడిపిస్తామని, ఇళ్ల నుంచి భయపడి వెళ్లిపోయిన ముస్లింలు తిరిగి రావడానికి హిందువుల నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆ కమిటీ మహాత్మా గాంధీకి హామీ ఇచ్చింది. హిందూ, ముస్లిమ్, సిక్కు వర్గాల
నాయకులు సఖ్యంగా ఉండటానికి కట్టుబడి ఉన్నామని ఆయనవద్ద ప్రమాణం కూడా చేశారు. జనవరి 18న మధ్యాహ్నం 12.45కు మౌలానా ఆజాద్ ఇచ్చిన నారింజ రసం తాగిన మహాత్మా గాంధీ తన నిరాహార దీక్షను విరమించారు.కాని ఈ మొత్తం వ్యవహారంలో గాంధీ పట్ల మతోన్మాదుల ద్వేషం బలపడింది. మత ప్రాతిపదికన పాకిస్తాన్ ప్రత్యేక దేశం ఏర్పాటుకు గాంధీ వ్యతిరేకిస్తున్నారని ముస్లింలు భావించగా, ముస్లింల వేధింపులపై ప్రతీకారం తీర్చుకునేందుకు గాంధీ తమకు అడ్డుపడుతున్నాడని హిందు తీవ్రవాదులు భావించారు.గాంధీ హత్యకు దారితీసింది హిందు- ముస్లింల మధ్య నెలకొన్న కలహాలే అనే వాదన బలంగా ఉంది. ఈ నేపథ్యంలో నే నాథూరామ్ గాడ్సే పథకం ప్రకారం 1948 సంవత్సరం జనవరి 30వ తేదీ నాడు బిర్లా మందిర్ ప్రార్థన మందిరం మైదానంలో హత్య చేయడం జరిగింది. గాంధీ సమ్మతితో కాంగ్రెస్ లోని అగ్రనేతలు అంతా కలిసి దేశాన్ని చీలికలు - పేలికలు గా మార్చారని, దేశ విభజనకు సమ్మతి తెలిపి పెద్ద కుమారుడు వంటి గాంధీ భారత దేశానికి ద్రోహం చేయడం ద్వారా ఆయన తన ధర్మాన్ని నెరవేర్చడంలో ఘోరంగా విఫలం అయ్యాడని, అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే నేను తుది నిర్ణయానికి వచ్చానని, అందుకే తానే గాంధీని కాల్చి చంపానని గాడ్సే కోర్టులో వివరించాడు. స్వతంత్ర భారతదేశంలో ఉరితీయబడిన మొదటి వ్యక్తిగా గాంధీని చంపిన నాథురాం వినాయక్ గాడ్సే చరిత్రలో నిలిచిపోయాడు.

# భారతి సిమెంట్స్ పై గురి

**ఒంగోలు, జనవరి 12,**
ఏదైనా చెబితే హేతుబద్ధత ఉండాలి. అబద్ధం చెప్పినా నమ్మినట్టు ఉండాలి. కానీ ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి తరచూ ఫెయిల్ అవుతున్నారు. ఇటీవల మీడియా ముందుకు వచ్చి మళ్లీ అమరావతి పై లేనిపోని మాటలు మాట్లాడారు. ఇప్పుడిప్పుడే జగన్ విషయాన్నీ మరిచిపోతున్న అమరావతి రైతులను మళ్లీ కెలికారు. నది గర్భంలో అమరావతిని కడుతున్నారు అంటూ నిందలేశారు. అయితే రెండో విడత భూసేకరణకు దిగుతున్న ప్రభుత్వంపై అమరావతి రైతులు అసంతృప్తితో ఉన్నారు. జగన్ ఆ మాటలు అనేసరికి వారంతా తమ అసంతృప్తి తగ్గించుకున్నారు. తమ శాశ్వత శత్రువు జగన్మోహన్ రెడ్డి అని బలంగా నమ్మడం ప్రారంభించారు. డామిట్ కథ అడ్డం తిరిగింది అంటూ సజ్జల రామకృష్ణారెడ్డి ఎంట్రీ ఇచ్చారు. జగన్ మాటలను వక్రీకరించారని సంజాయిషి ఇవ్వడం ప్రారంభించారు. అమరావతి తో వదల్లేదు జగన్. ఏపీ నుంచి పరిశ్రమలు వెళ్లిపోతున్నాయని కూడా వ్యాఖ్యానించారు. అందులో భారతి సిమెంట్స్ గురించి ప్రస్తావించారు ఇప్పుడు అందరూ ఆశ్చర్యపోతున్నారు.జగన్ అధికారంలో ఉన్నప్పుడు చాలా కంపెనీలు పెట్టుబడుల పేరుతో ఏపీలో ఆస్తులు ఆక్రమించుకుంటాయి. జగన్ అధికారంలో లేకపోతే వాటి దగ్గర పెట్టుబడులకు డబ్బులు ఉండవు. అయితే పారిపోయిన పరిశ్రమల జాబితాలో జగన్మోహన్ రెడ్డి భారతి సిమెంట్స్ ను చేర్చడం చాలామంది ఆశ్చర్యానికి కారణం అయింది. ప్రభుత్వం వేధిస్తున్నందున తమ సంస్థను కూడా తరలిస్తామని జగన్ చెబుతున్నారు. అయితే ప్రభుత్వం అక్రమంగా ఆయన కేటాయింపు చేసుకున్న భూముల లీజు విషయంలో నోటీసులు మాత్రమే ఇచ్చింది. దానిని వేధింపులుగా




భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. జగన్ అధికారంలో ఉన్నప్పుడే తన కుటుంబ సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా వేల కోట్ల రూపాయల విలువైన గనులను కట్టబెట్టారు. భారతి సిమెంట్స్ కు కేటాయించిన లీజుల్లో నిబంధనలను ఉల్లంఘించారని తేలడంతో.. కూటమి ప్రభుత్వం ఆ లీజులను రద్దు చేసేందుకు సిద్ధపడింది. దానిని పరిశ్రమలను తరిమివేయడం అంటారా?అసలు భారతి సిమెంట్స్ ఏర్పాటు అక్రమమని ఆరోపణలు ఉన్నాయి.. భారతి సిమెంట్స్ అసలు పేరు అది కాదు. రఘురాం సిమెంట్స్. 2004లో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత.. ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ఆ కంపెనీని కొనుగోలు చేశారు. రఘురాం సిమెంట్స్ కంపెనీకి సున్నపురాయి లీజులు ఉన్నాయి. భారతి సిమెంట్స్ గా మారిన తర్వాత ఆ లీజులను ఆ కంపెనీ వాడుకుంది. ఇటువంటి పరిస్థితుల్లో గనుల విషయంలో కేంద్రం స్పష్టమైన పాలసీని తీసుకొచ్చింది. ఓ కంపెనీ పేరుతో లీజులు తీసుకొని.. మరో కంపెనీ టేక్ ఓవర్ చేస్తే లీజులు చెల్లవు అని స్పష్టం చేసింది. 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వం రఘురాం సిమెంట్స్కు ఇచ్చిన ప్రాథమిక అనుమతిని కూడా రద్దు చేసింది.2019లో ఏపీలో అధికారం మారిన తర్వాత సీన్ చేంజ్ అయింది. కొన్ని రకాల న్యాయపరమైన అంశాలను తెరపైకి తెస్తూ లీజులను పునరుద్ధరించుకున్నారు. అయితే హైకోర్టు ఈ విషయంలో కొన్ని రకాల సూచనలు చేసిన పట్టించుకోలేదు. సరిగ్గా 2024 ఎన్నికలకు ముందు లీజులను పునరుద్ధరిస్తూ జీవోలు జారీచేశారు. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు వెళ్ళింది. విచారణ చేయాలని రాష్ట్రానికి కేంద్రం లేఖ రాసింది. దీంతో అసలు విషయం బయటపడింది. రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంతో పరిశ్రమలను తరిమేస్తున్నారన్న ప్రచారం మొదలుపెట్టారు జగన్.

# రాజ్యసభ సీటు రేసు చర్చ



**విజయవాడ, జనవరి 12,**
కూటమిలో రాజ్యసభ సీటు రేసు చర్చకు దారితీస్తోంది. మరో నాలుగు నెలల్లో ఏపీలో నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ కానున్నాయి. ఆ నాలుగు సీట్ల కోసం అటు టీడీపీ, ఇటు జనసేన, మరోవైపు బీజేపీలో ఎవరి ఎక్స్‌పెక్టేషన్స్ వాళ్లకు ఉన్నాయ్. టీడీపీలో అయితే పైరవీల పర్వం నెక్స్ట్ లెవల్‌లో నడుస్తోందట. ఈ ఏడాది మే-జూన్ మధ్య జరిగే రాజ్యసభ సభ్యుల ఎన్నికలపై అప్పుడే లాబీయింగ్ జోరుందుకుందట. ఖాళీ అయ్యే నాలుగు సీట్లను టీడీపీ, కూటమి పార్టీలే గెలుచుకునే అవకాశం ఉంది.ఏపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని పదవీ కాలం 2026 జూన్ 21తో పూర్తి కానుంది. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఉపఎన్నికలో టీడీపీ తరపున రాజ్యసభకు ఎన్నికైన సానా సతీష్ పదవీకాలం కూడా జూన్‌లోనే ముగుస్తుంది. వీళ్ల స్థానంలో నలుగురు నేతలు ఏపీ నుంచి రాజ్యసభకు ఎన్నిక కానున్నారు.అయితే మూడు పార్టీలు..నాలుగు సీట్లను ఎలా పంచుకుంటాయనేదే ఆసక్తికరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు రాజ్యసభకు ఉప ఎన్నికలు జరిగాయి. తొలుత మూడు స్థానాలకు, ఆ తర్వాత ఒక స్థానానికి ఎన్నిక జరిగితే టీడీపీ, బీజేపీ చెరో రెండు సీట్లు తీసుకున్నాయి. కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేనకు ఇప్పటివరకు రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశం దక్కలేదు. ఈ పరిస్థితుల్లో త్వరలో ఖాళీ కానున్న రాజ్యసభ ఎన్నికల్లో జనసేనకు ఓ సీటు కేటాయిస్తారని అంటున్నారు. జనసేనకు కేటాయించే రాజ్యసభ సీటులో లింగమనేని రమేష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి పేరు కూడా పరిశీలనలో ఉందని..తన అన్నయ్యను పెద్దలకు సభకు పంపితే ఎలా ఉంటుందనేదానిపై పార్టీ ముఖ్యనేతలతో పవన్ చర్చలు జరుపుతున్నట్లు ఇన్‌సైడ్ టాక్.నాలుగింట్లో ఒకటి జనసేనకు పోతే మిగిలేది మూడు సీట్లు. త్వరలో రిటైర్ అయ్యే నలుగురు రాజ్యసభ సభ్యుల్లో ఒకరైన రిలయన్స్ సంస్థలకు చెందిన పరిమళ్ నత్వానీని మళ్లీ రాజ్యసభకు పంపాలని బీజేపీ ఆలోచనగా చెబుతున్నారు. సేమ్‌టైమ్ బీజేపీ ఇంకో సీటును కూడా కోరే అవకాశం ఉందన్న గుసగుసలు మొదలయ్యాయి. అదే గనుక జరిగితే..బీజేపీకి రెండు సీట్లు ఇస్తే టీడీపీకి దక్కేది ఒక్కటే సీటు. ఆ సీటులో కూడా గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఉపఎన్నికలో టీడీపీ తరపున ఎన్నికైన సానా సతీష్‌కే మళ్లీ రెన్యూవల్ చేస్తారని టాక్ వినిపిస్తోంది. దీంతో టీడీపీకి కొత్తగా ఒక్క రాజ్యసభ సీటు కూడా వచ్చే అవకాశం లేదన్న చర్చ జరుగుతోంది.
టీడీపీలో చాలా మంది సీనియర్లు, గత ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన లీడర్లు రాజ్యసభ రేసులో వెయిటింగ్‌లో ఉన్నారు. గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండిపోయిన గల్లా జయదేవ్, పొత్తుల్లో భాగంగా సీట్లు కోల్పోయిన దేవినేని ఉమా, పిఠాపురం వర్మ, జవహర్‌తో పాటు సీనియర్ నేత వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహన్‌రావు, టీడీ జనార్ధన్, కనకమేడల రవీంద్రకుమార్, రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి..రాజ్యసభ బెర్తును ఆశిస్తున్న వారిలో ఉన్నారు.పెద్దల సభకు వెళ్లాలని ఆశపడుతున్న నేతలంతా టీడీపీకి, చంద్రబాబుకు సన్నిహితులు. పార్టీకి ఏదో విధంగా ఉపయోగపడిన వారే. కమ్మ, ఎస్సీ, బీసీ, రెడ్డి వర్గాల నుంచి ఆరేడుమంది రాజ్యసభ సీటు ఆశిస్తుండగా..తమకు దక్కే సీట్లపైనే టీడీపీ అధిష్టానం డైలమాలో ఉందట. ఎలాగైనా రెండు సీట్లు తీసుకుని ఒకటి సానా సతీష్‌కు రెన్యూవల్ చేయడంతో పాటు మరొక సీటు ఆశావహుల్లో ఎవరికో ఒకరికి ఇచ్చి మిగతా వారిని మండలి రేసులో పెట్టే ప్లాన్ చేస్తున్నారట చంద్రబాబు.

## చలనచిత్ర రంగంలో అపూర్వమైన నటీమణి అంజలీదేవి

**హైదరాబాద్:** తెలుగు చలనచిత్ర రంగంలో అంజలీదేవి ఒక అపూర్వమైన నటీమణి. "అభినవ సీత"గా పేరుగాంచిన ఆమె, తన అద్భుతమైన అభినయంతో ప్రేక్షకులను అలరించి, తెలుగు సినిమా రంగ సర్వతో ముఖాభివృద్ధికి అమూల్యమైన కృషి చేశారు. ఆమె జీవితం, నటన ప్రతిభ తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయి.అంజలీదేవి అసలు పేరు అంజనీ కుమారి. 1927 ఆగస్టు 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురం గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆమెకు నాటకం, కళలపై ప్రగాఢ ఆసక్తి ఉండేది. కుటుంబ సహకారం లేకపోయినా ఆమె కళారంగం పట్ల నిబద్ధతతో, రంగస్థలంలో చేరి తన నటనా ప్రతిభను కనబరిచారు.అంజలీదేవి చలనచిత్ర రంగంలో 1936లో రాజా హరిశ్చంద్రలో అంజలీదేవి చిన్న పాత్రతో పరిచయమైనా, అయితే ఆమెకు పేరును తెచ్చిన చిత్రం "భక్త తుకారాం". ఈ చిత్రంలో ఆమె నటన ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. ఆమె నటనలో సహజత్వం, భావోద్వేగాలు, రుచికరమైన శైలీ తదితర లక్షణాలు ఆమెను ప్రఖ్యాతిని అందించాయి.అంజలీదేవి ప్రధానంగా పురాణిక, చారిత్రక పాత్రల్లో మరింత మెరిసి పోయారు. "సీతారామ కళ్యాణం", "మాయా బజార్", "అనార్కలి", "సువర్ణ సుందరి", "భక్త ప్రహ్లాద", "చంద్రహారం" వంటి చిత్రాల్లో ఆమె చేసిన పాత్రలు ఇంకా గుర్తుండి పోతున్నాయి. "మాయాబజార్" లో ఆమె చేసే నాటకీయ నటన ప్రేక్షకులను మంత్రగత్తెలా ఆకట్టుకుంది "సువర్ణ సుందరి" లో ఆమె గానం, నృత్యం మరియు నటనలో ప్రతిభను ప్రతిబింబించింది. "సీతారామ కళ్యాణం", లవకుశ చిత్రాలలో ఆమె సీత పాత్రను గాఢమైన భావోద్వేగాలతో పోషించి, "అభినవ సీత"గా గుర్తింపు పొందారు.అంజలీదేవి నటనతోనే కాకుండా నిర్మాతగా కూడా విజయ వంతంగా పని చేశారు. 1950ల మధ్య ఆమె స్థాపించిన "అంజలీ పిక్చర్స్" బ్యానర్ ద్వారా "అనార్కలి", "సువర్ణ సుందరి", "భక్త తుకారాం" వంటి సినిమాలను నిర్మించారు. ఈ చిత్రాలు కేవలం ప్రేక్షకాదరణ పొందడమే కాకుండా ఆర్థిక విజయాన్ని కూడా సాధించాయి. అంజలీదేవి నటనలో సహజత్వం, హావభావాల సాఫీ అమలుబడి, భావోద్వేగపూరిత సంభాషణలు ఆమెను ప్రత్యేకంగా నిలిపాయి. ఆమె నటించిన పాత్రలు చాలా విభిన్నంగా ఉన్నాయి. ఆమె సాంప్రదాయ పాత్రలతో పాటు, సమకాలీన పాత్రల్లో కూడా అద్భుతంగా మెరిపించారు. నర్తకి గానూ, ఆమె చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఆమె శాంత స్వభావం, సరళత, ఇతరులకు సహాయపడే ప్రవర్తన ఆమెకు మరింత గౌరవాన్ని తెచ్చి పెట్టాయి.అంజలీదేవి తన కెరీర్‌లో అనేక పురస్కారాలు పొందారు. ముఖ్యమైనవి రఘుపతి వెంకయ్య అవార్డు, నంది పురస్కారాలు, పద్మశ్రీ పురస్కారం (భారత ప్రభుత్వం). ఈ అవార్డులు ఆమె నటనలోని విశిష్టతను, తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చేసిన అమూల్యమైన కృషిని గుర్తించే ప్రతీకలుగా నిలిచాయి.2014 జనవరి 13న అంజలీదేవి మరణం తెలుగు సినీ పరిశ్రమలో ఒక అపూర్వమైన లోటును ఏర్పరచింది. కానీ ఆమె సినీ రంగంలో చేసిన సేవలు, నటనా ప్రతిభ తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరకాలం నిలిచి పోతాయి. ఆమె మరణం తెలుగు సినిమా పరిశ్రమలో విషాదం తెచ్చినా, ఆమె సృష్టించిన చిత్రాలు ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి.అంజలీదేవి తెలుగు చలనచిత్ర రంగానికి గొప్ప సేవలు అందించారు. ఆమె తన నటన, సంగీతం, నృత్యం, నిర్మాతగా చేసిన కృషి తదితర ప్రతిభలకు అజేయమైన గుర్తింపు సంపాదించింది. ఆమె సినీ జీవితాన్ని పరిశీలిస్తే, ఆమె వ్యక్తిత్వం, శ్రద్ధ, గౌరవం, నిరంతర కృషి తెలుగు సినీ పరిశ్రమకు పునాదిగా నిలుస్తుంది.తెలుగు సినిమా చరిత్రలో అంజలీదేవి పేరు ఒక అద్భుతమైన అధ్యాయంగా నిలిచి పోతుంది. ఆమె నటన, పాత్రల ఎంపిక, నృత్య ప్రతిభ తదితర సేవలు తరువాతి తరాల నటీనటులకు స్ఫూర్తి. ఆమె పేరు తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటుంది.

## చంద్రబాబుకు తలనొప్పిగా సొంత మనుషులు

**విజయవాడ, జనవరి 12,** చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు సొంత సామాజికవర్గం లోనే శత్రువులు ఎక్కువయ్యారు. ప్రత్యర్థులు చేసే విమర్శలను పెద్దగా పట్టించుకోవాల్సిన పనిలేదు. కానీ సొంత సామాజికవర్గం నేతలే చంద్రబాబు ప్రతి నిర్ణయాన్ని తప్పుపడుతుండటం ఆయనకు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతుందనే చెప్పాలి. ఒకరకంగా చంద్రబాబు నాయుడుకు బయట శత్రువులతో కంటే ఇంట్లో శత్రువులతో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఈసారి కనిపిస్తుంది. ప్రధానంగా ఈసారి మాత్రం కమ్మ సామాజికవర్గం నేతలు మాత్రమే ఆయనను రాజకీయంగా ఇరకాటంలోకి నెడుతున్నారని చెప్పాలి. అందులో ప్రధానంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఏబీ వెంకటేశ్వరరావు, ముప్పవరపు వెంకయ్య నాయుడులు ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు ఇబ్బందికరంగా మారాయి.వడ్డే శోభనాద్రీశ్వరరావు
మాజీ టీడీపీ నేత. చంద్రబాబు మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు రాజకీయంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితేనేం రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. చంద్రబాబు వ్యతిరేక మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా వడ్డే ఇంటర్వ్యూలతో చెలరేగిపోతున్నారు. చంద్రబాబు రాజధాని పేరిట రైతులను నిలువునా ముంచుతున్నారంటూ వడ్డే శోభనాద్రీశ్వరరావు పదే పదే వ్యాఖ్యానిస్తున్నారు. తొలిదఫా ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చిన రైతులు ఇబ్బందులను చూసైనా రెండో విడత భూ సమీకరణకు సహకరించవద్దంటూ రైతులకు వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపు నిస్తున్నారు. పచ్చని పంటలు పండే భూములను సర్వనాశనం చేస్తున్నారని, కలల్లో చంద్రబాబు విహరిస్తున్నారని ఫైర్ అవుతున్నారు. మరో ఎయిర్ పోర్టు, మరో ఆరులేన్ల రహదారి అవసరమా? అని ప్రశ్నిస్తున్నారు.ఇక ఏబీ వెంకటేశ్వరరావు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇంటలిజెన్స్ చీఫ్ గా పనిచేశారు. తర్వాత పదవీ విరమణ చేశారు. కానీ ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద పదవి వస్తుందని ఏబీ వెంకటేశ్వరరావు భావించారు. పోలీసు కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమించారు. దానిని తీసుకునేందుకు ఏబీ వెంకటేశ్వరరావు ఇష్టపడలేదు. పైగా రాష్ట్రంలో కొత్త పార్టీ పెడతానని చెబుతున్నారు. అలాగే యాభై వేల ఎకరాలు తొలి విడత సేకరించిన భూమిని ఎవరెవరికిచ్చారో లెక్కలు చెప్పాలంటూ ఏబీ వెంకటేశ్వరరావు మీడియా ద్వారా నిలదీస్తున్నారు. ఇది కూడా చంద్రబాబుకు ఇబ్బందికరమే. ఇక మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఇటీవల మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను తప్పుపట్టేలా మాట్లాడటం కూడా బాబు సర్కార్ ను ట్రబుల్ లోకి నెట్టింది. విద్య, వైద్యం మాత్రం ఉచితంగా పేదలకు అందించాలని, మిగిలిన పథకాలను రద్దు చేయాలంటూ వెంకయ్య నాయుడు చేసిన వ్యాఖ్యలు జగన్ తో పాటు చంద్రబాబుకు కూడా తగిలినప్పటికీ ఎక్కువ డ్యామేజీ చంద్రబాబుకే నంటున్నారు. అలా ఈ ముగ్గురు చేస్తున్న వ్యాఖ్యలు చంద్రబాబుకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి

# తెల్లజుట్టు సమస్యకు వంటింటి చిట్కా

జుట్టు తెల్లబడటం అనేది నేటి కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలా మందిని బాధిస్తున్న ఒక సాధారణ సమస్య. మార్కెట్లో లభించే రసాయనాలతో కూడిన ఉత్పత్తులు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తున్నప్పటికీ, వాటి దీర్ఘకాలిక ప్రభావాల గురించి ఆందోళనలు ఉన్నాయి. అయితే, ఈ సమస్యకు మన వంటింట్లోనే ఒక అద్భుతమైన మరియు సహజసిద్ధమైన పరిష్కారం ఉందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అదే, సొరకాయ ఉపయోగించి తయారుచేసే ప్రత్యేకమైన నూనె. ఈ పురాతన చిట్కా జుట్టుకు పోషణనిచ్చి, దాని సహజసిద్ధమైన నలుపు రంగును తిరిగి తీసుకురావడానికి సహాయపడుతుంది. జుట్టు నల్లబడటానికి సొరకాయ నూనెను తయారుచేసే పద్ధతి చాలా సులభం. ముందుగా, సొరకాయను చిన్న ముక్కలుగా కత్తిరించుకోవాలి. ఈ ముక్కలను కనీసం వారం రోజుల పాటు బాగా ఎండబెట్టుకోవాలి. ఈ ప్రక్రియ వల్ల సొరకాయలోని తేమ పూర్తిగా తొలగిపోయి, దాని పోషక విలువలు నూనెలోకి చేరడానికి సిద్ధమవుతాయి. ఇలా ఎండిన ముక్కలను ఒక మందపాటి పాత్రలో తీసుకోవాలి. తరువాత, ఈ ఎండిన సొరకాయ ముక్కలకు సరిపడా మంచి నాణ్యత గల కొబ్బరి నూనెను (ఎఱతీస్త్రఱఅ జశీఎశీఅబ్ ాఱశ్రీను వాడటం ఉత్తమం) జోడించాలి. ఈ మిశ్రమాన్ని మంటపై ఉంచి, సొరకాయ ముక్కలు రంగు మారే వరకు లేదా ముక్కలు పూర్తిగా నూనెలో కలిసిపోయినట్లు అయ్యే వరకు తక్కువ మంటపై బాగా మరిగించాలి. ఇలా మరిగించడం వల్ల సొరకాయలోని కీలకమైన పోషకాలు మరియు సహజ



వర్ణకాలు నూనెలోకి పూర్తిగా విడుదలవుతాయి. అనంతరం, ఆ నూనెను చల్లార్చి, ఒక శుభ్రమైన వడపోత గుడ్డ సహాయంతో వడబోసి, గాలి చొరబడని గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. ఈ ఇంట్లో తయారుచేసిన సొరకాయ నూనెను వారానికి కనీసం ఒకసారి తలకు పట్టించి, వేళ్ళతో సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. రాత్రంతా ఉంచి, మరుసటి రోజు ఉదయం మైల్డ్ షాంపూతో తలస్నానం చేయడం వల్ల ఉత్తమ ఫలితం ఉంటుంది. ఇలా తరచుగా చేయడం వలన జుట్టు కుదుళ్ళు బలం

పుంజుకుంటాయి, జుట్టు నల్లబడటం ప్రారంభమవుతుంది. రసాయనాలు లేని ఈ సహజసిద్ధమైన చికిత్స జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, తెల్లజుట్టు సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని చూపడంలో సహాయపడుతుంది.

# పాదాల తిమ్మిర్లు ఉంటే అనారోగ్యానికి సంకేతం



పాదాల వాపులు వస్తున్నాయంటే తప్పనిసరిగా జాగ్రత్తపడాల్సి ఉంటుంది. నిజానికి చాలా మంది ఈ లక్షణాలను పెద్దగా పట్టించుకోరు. వాపులు, తిమ్మిర్లు తగ్గడానికి తాత్కాలికంగా మందులు వేసుకుని అక్కడితో వదిలేస్తారు. కానీ ఈ చిన్న సమస్యలే చాలా పెద్ద ముప్పుగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే..వీలైనంత త్వరగా స్పందించాలి. మరి ఇలా పాదాల్లో జరిగే మార్పులు ఏయే రోగాలకు సంకేతాలు.

పాదాల ఆరోగ్యాన్ని చాలా మంది పట్టించుకోరు. నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఇవే క్రమంగా పెద్దవై ముప్పు తెచ్చి పెడతాయి. చర్మం రంగు మారడం నుంచి తిమ్మిర్లు ఎక్కడం వరకూ ఎన్నో రకాలుగా సమస్యలు వస్తాయి. నడిచేటప్పుడు కూడా ఈ మార్పులు స్పష్టంగా కనబడతాయి. అలాంటప్పుడే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించడం మంచిది. ఏ మాత్రం ఆలస్యం చేసినా కండీషన్ సీరియస్ అయ్యే ముప్పు ఉంటుంది. నిజానికి పాదాల్లో ఇలాంటి మార్పులు వస్తున్నాయంటే ఎన్నో తీవ్ర అనారోగ్యాలకు ఇవి సంకేతాలు కావచ్చు అని పలు అధ్యయనాలు తేల్చి చెబుతున్నాయి. ముఖ్యంగా దయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధుల లక్షణాలు ఇదే విధంగా ఉంటాయి. పాదాల్లో మంట, కురుపులు రావడం లాంటి లక్షణాలు రక్త సరఫరా సరిగ్గా లేనప్పుడు కనబడతాయి. ముఖ్యంగా నరాలు డ్యామేజ్ అయినప్పుడు కూడా పాదాల్లో ఇలాంటి మార్పులు కనిపించే అవకాశాలున్నాయి. ఇలాంటప్పుడు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

పాదాల్లో ఉష్ణోగ్రతల్లో మార్పులు వచ్చినప్పుడు కూడా రంగు మారేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వాపులను మాత్రం తప్పనిసరిగా గమనించాలి. ధమనుల్లో కొవ్వు పేరుకుపోయినప్పుడు, వీటి ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు ఇలా పాదాల్లో వాపులు వస్తాయి. సరైన సమయానికి సరైన వైద్యం అందించకపోతే తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. తరచూ తిమ్మిరిగా ఉండడం, దురద లాంటి లక్షణాలు కనిపించాయంటే అది దయాబెటిస్ లక్షణం కావచ్చు. లేదా నరం డ్యామేజ్ అయినప్పుడు కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. బ్లడ్ షుగర్ లెవెల్స్ అసలు కంట్రోల్ లో లేనప్పుడు ఇలా జరుగుతుంది. నరాలు ఒత్తిడికి గురైనప్పుడు లేదా ఇంకేదైనా న్యూరో సమస్యలు తలెత్తినప్పుడు ఇలా పాదాల్లో తిమ్మిర్లు

వచ్చే అవకాశం ఉంటుంది. అయితే..ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు చాలా త్వరగా స్పందించాల్సి ఉంటుంది. లేదంటే ఈ సమస్య కాస్త తీవ్ర ఇన్ఫెక్షన్ కి దారి తీసే ప్రమాదం ఉంది. పాదాల్లో విపరీతమైన నొప్పి, వాపులు వస్తుంటాయి. పాదాలు చాలా బరువెక్కినట్టుగా అనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపించాయంటే గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్టు లెక్క. దీన్నే ఎడిమా అంటారు. ముఖ్యంగా హార్ట్ ఫెయిల్యూర్ కండీషన్స్ లో ఈ సమస్య తలెత్తుతుంది. గుండె కండరాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా ఇలాగే పాదాల్లో వాపులు కనిపిస్తాయి. పాదాల్లో ఎక్కువగా కదలికలు వచ్చే కొద్దీ ఈ వాపులు ఎక్కువవుతుంటాయి. ఎక్కువ సమయం పాటు నిలబడినా, ఎక్కువ సేపు కూర్చున్నా వాపులు మరీ ఎక్కువవుతాయి. ఇలాంటి సమయంలో సరైన చికిత్స తీసుకోకపోతే లక్షణాలు మరీ తీవ్రమవుతాయి. పాదాలపై చర్మం పొడిగా మారడం, చర్మం రంగు మారిపోవడం లాంటి లక్షణాలు కనబడతాయి. ఏదైనా గాయం అయినప్పుడు ఎక్కువ రోజుల పాటు మానకుండా అలాగే ఉన్నా అది దయాబెటిస్ లక్షణం కావచ్చు. కొన్ని సార్లు ఈ అల్సర్స్ చాలా తీవ్రమవుతాయి. త్వరగా చికిత్స తీసుకుంటే ఇబ్బంది లేకుండా ఉంటుంది.

# శక్తి తరగకుండా ఉండాలంటే ఈ డైట్ పాటించండి!



నలభై ఏళ్లు దాటిన మహిళల శరీరంలో అనేక ముఖ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. హార్మోన్ల సమతుల్యతలో మార్పులు, జీవక్రియ (మెటబాలిజం) మందగించడం, ఎముకల సాంద్రత తగ్గడం వంటి కారణాల వల్ల గతంలో ఉన్నంత ఉత్సాహం, శక్తి తరచుగా తగ్గిపోతుంటాయి. ఎంత సమయానికి తింటున్నా కొన్నిసార్లు నీరసం, అలసట చుట్టుముట్టవచ్చు. ఈ దశలో, కేవలం ఆహారం తీసుకోవడం సరిపోదు. శరీరానికి తగిన పోషకాలు అంది, శక్తిని కాపాడుకోవడానికి సమతుల్యమైన (బ్యాలెన్స్‌డ్) ఆహార విధానాన్ని అనుసరించడం చాలా ముఖ్యం. నిపుణులు కూడా దీనినే గట్టిగా సూచిస్తున్నారు. శరీరానికి అవసరమైన అన్ని రకాల విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా అందాలంటే, ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వివిధ రంగుల్లో ఉండే పండ్లు, ఆకుకూరలు యాంటీఆక్సిడెంట్లను అందించి కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ముఖ్యంగా, ఎముకల బలం కోసం కాల్షియం, విటమిన్ డి అవసరం. వీటితో పాటు రక్తహీనతను నివారించేందుకు ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను కూడా డైట్‌లో చేర్చుకోవాలి. ఈ పవర్‌హౌస్ లాంటి ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. 40 ఏళు పైబడిన తర్వాత, కండరాల క్షీణతను నివారించడానికి ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం తప్పనిసరి. అందుకే, ఆహారంలో పాల ఉత్పత్తులు (పాలు, పెరుగు, పన్నీర్), అలాగే మాంసాహారం, గుడ్లు వంటి వాటిని తగిన మోతాదులో చేర్చుకోవాలి. పాల ఉత్పత్తులు కాల్షియంను అందిస్తే, మాంసాహారం, గుడ్లు నాణ్యమైన ప్రోటీన్‌ను అందిస్తాయి. శాఖాహారులు పప్పులు, చిక్కుళ్లు, సోయా వంటి వాటిని తీసుకోవడం ద్వారా ప్రోటీన్ అవసరాలను తీర్చుకోవచ్చు. ఈ కీలకమైన పోషకాలు శరీరాన్ని దృఢంగా ఉంచి, రోజంతా శక్తివంతంగా ఉండేలా చేస్తాయి. శక్తి స్థాయిలను మెరుగుపరచుకోవడానికి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పీచు పదార్థాలు (ఫైబర్) ఉన్న ఆహారాన్ని డైట్‌లో పెంచాలి. తృణధాన్యాలు, పప్పులు, కూరగాయలలో పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి మలబద్ధకాన్ని నివారిస్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా, ఎంత మంచి ఆహారం తీసుకున్నా, శరీరం హైడ్రేటెడ్‌గా (సరిపడా నీటితో) ఉండటం చాలా అవసరం. అందుకే, తరచుగా, సరిపడా నీటిని తాగాలి. తగినంత నీరు తాగడం వల్ల నీరసం తగ్గుతుంది, జీవక్రియ సక్రమంగా పనిచేస్తుంది. ఈ మార్పులను పాటించడం ద్వారా 40 ప్లస్ మహిళలు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండగలుగుతారు.

## ఈ జ్యూస్ తాగితే చాలు..
## క్యాన్సర్, షుగర్ సమస్యలన్నీ దూరం..!



బొప్పాయి ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరమైన పండు. కానీ, బొప్పాయి ఆకులు కూడా అంతే ప్రయోజనకరంగా ఉంటాయని మీకు తెలుసా? బొప్పాయి ఆకుల రసం తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. బొప్పాయి ఆకుల రసం పోషకాలతో సమృద్ధిగా ఉండటమే కాకుండా, దాని ఎంజైమ్‌లు, యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడతాయి. డెంగ్యూ జ్వరానికి చికిత్స: డెంగ్యూ జ్వరానికి చికిత్స చేయడంలో బొప్పాయి ఆకుల రసం చాలా ప్రభావవంతంగా పరిగణిస్తారు. డెంగ్యూ జ్వరం ప్లేట్‌లెట్ కౌంట్‌లో వేగంగా తగ్గుదలకు కారణమవుతుంది. బొప్పాయి ఆకులలో ఉండే పపైన్, కైమోపాపైన్ వంటి ఎంజైమ్‌లు ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచడంలో సహాయపడతాయి. ఇంకా, ఈ రసం శరీరం రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. వేగంగా కోలుకోవడానికి దోహదపడుతుంది. జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది: బొప్పాయి ఆకుల రసం జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే ఎంజైమ్‌లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. గ్యాస్, ఆమ్లత్వం, మలబద్ధకం వంటి కడుపు సమస్యలను తగ్గిస్తాయి. ఈ రసం ప్రేగులను శుభ్రపరచడానికి, ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: బొప్పాయి ఆకులలో విటమిన్ సి, విటమిన్ ఎ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ మూలకాలన్నీ శరీర వ్యాధితో పోరాడే సామర్థ్యాన్ని పెంచడంలో సహాయపడతాయి. ఈ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల జలుబు, ఇతర ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. మధుమేహాన్ని నియంత్రిస్తుంది: బొప్పాయి ఆకుల రసం మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీని భాగాలు ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. మధుమేహాన్ని నిర్వహించడం సులభం చేస్తుంది. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది: బొప్పాయి ఆకుల రసం కాలేయానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది కాలేయాన్ని నిర్విషీకరణ చేయడంలో సహాయపడుతుంది. సిర్రోసిస్, కామెర్లు వంటి కాలేయ వ్యాధులను నివారిస్తుంది. ఇంకా, ఈ రసం సరైన కాలేయ పనితీరును నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది.

## బరువు తగ్గాలనుకుంటున్నారా..?



ఈ ధాన్యాలు శరీర జీవక్రియను వేగవంతం చేస్తాయి, దీని కారణంగా శరీరంలోని కొవ్వు వేగంగా కరగడం ప్రారంభమవుతుంది. మీరు వీటిని ప్రతిరోజూ సరైన రీతిలో తింటే, కేవలం ఒక నెలలోనే బరువు తగ్గడం ప్రారంభమవుతుంది. ప్రత్యేకత ఏమిటంటే ఈ ధాన్యాలు బొడ్డు కొవ్వును తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటాయి. ఇటీవలి కాలంలో ఊబకాయం ఒక సాధారణ సమస్యగా మారింది. డైటింగ్, వ్యాయామం తర్వాత కూడా బరువు తగ్గడం కష్టంగా మారింది. కానీ, మీ కోసం కొవ్వును కరిగించే యంత్రంగా మారగల ఒక ఇంటి నివారణ ఉంది. అది ఏమిటో తెలిస్తే మీరు షాక్ అవుతారు. ఎందుకంటే..ఇది మీ వంటగదిలో తప్పనిసరిగా ఉండే చిన్న పసుపు ధాన్యం. కొన్నిసార్లు వంటలో కూడా ఉపయోగించబడుతుంది. నిజానికి, ఇది అద్భుతమైన లక్షణాలతో నిండి ఉంది. ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. పెద్దలు దీనిని ప్రతిరోజూ ఉపయోగించేవారు. ఈ ధాన్యాలు శరీర జీవక్రియను వేగవంతం చేస్తాయి, దీని కారణంగా శరీరంలోని కొవ్వు వేగంగా కరగడం ప్రారంభమవుతుంది. మీరు వీటిని ప్రతిరోజూ సరైన రీతిలో తింటే, కేవలం ఒక నెలలోనే బరువు తగ్గడం ప్రారంభమవుతుంది. ప్రత్యేకత ఏమిటంటే ఈ ధాన్యాలు బొడ్డు కొవ్వును తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటాయి. మరి ఆహార ధాన్యం అంటే ఏమిటి? ఇంతకీ ఈ అద్భుత ధాన్యం ఏంటా అని మీరు ఆలోచిస్తున్నారా? అవి చిన్న మెంతి గింజలు..అవును బరువు తగ్గాలనుకునే వారికి మెంతులు దివ్యౌషధంగా నిరూపించబడ్డాయి. బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారు మెంతుల్ని ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వీటిల్లోని ఫైబర్ ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. తద్వారా అదనపు కెలరీలు తీసుకునే అవకాశం ఉండదు. మెంతి పొడిని ఆహారంలో భాగం చేసుకున్న వాళ్లకు ఆకలి తగ్గి, తద్వారా బరువు నియంత్రణలోకి వచ్చినట్టు ఓ అధ్యయనం చెబుతోంది. మెంతుల్ని నానబెట్టి ఉదయాన్నే తీసుకుంటే జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. మెంతుల్లోని పీచు పొట్ట ఆరోగ్యానికి మేలు చేసే బ్యాక్టీరియా పెరగడానికి సాయపడుతుంది. మెంతులుల్లోని పీచు, ఆల్కలాయిడ్స్ మధుమేహాన్ని అదుపులో ఉంచడానికి సాయపడతాయి. మధుమేహం సమస్య ఎక్కువగా ఉన్నవాళ్లు, టైప్–2 డయాబెటిస్ బాధితులు.. నానబెట్టిన మెంతుల్ని ఉదయాన్నే తీసుకుంటే రోజంతా రక్తంలో చక్కెర స్థాయులు పెరగకుండా చూస్తాయి.

## పోషకాల సిరులు సన్‌ఫ్లవర్ సీడ్స్

విత్తనాలు తినడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. చియా గింజలు, అవిసె గింజలు, గుమ్మడికాయ గింజలు, నల్ల బీన్ గింజలు, జనపనార గింజలు, పొద్దుతిరుగుడు విత్తనాలు వంటి అనేక రకాల విత్తనాలు ఉన్నాయి. అన్ని రకాల విత్తనాలు ఆరోగ్యకరమైన కొవ్వులతో సమృద్ధిగా ఉంటాయి. ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాల గురించి చెప్పాలంటే, మనం తరచుగా వాటిని సలాడ్లు, పెరుగు, స్మూతీలు లేదా చిరుతిండిగా తీసుకుంటాము. పొద్దుతిరుగుడు విత్తనాల గురించి చెప్పాలంటే, మనం తరచుగా వాటిని సలాడ్లు, పెరుగు, స్మూతీలు లేదా చిరుతిండిగా తీసుకుంటాము. పొద్దుతిరుగుడు విత్తనాలలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ జు, మెగ్నీషియం, సెలీనియం, అనేక ఇతర పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటాయి. పొద్దుతిరుగుడు విత్తనాలను మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఈ విత్తనాలు ఎముకలు, కండరాలను బలోపేతం చేయడంలో ప్రయోజనకరమైన ప్రభావాన్ని చూపుతాయి. ఈ గింజల్లో ఉండే విటమిన్ బి6, విటమిన్ ఇ, ఐరన్, సెలీనియం జుట్టు రాలకుండా చూస్తాయి. జుట్టును బలంగా, ఒత్తుగా మారుస్తాయి. సన్‌ఫ్లవర్ సీడ్స్ తింటే ఎక్కువసేపు ఆకలి వేయదు. దీంతో బరువు అదుపులో ఉంటుంది. అందుకే బరువు తగ్గాలని చూసేవారు ఈ గింజలు తినడం మంచిది. ఈ గింజల్ని తినడం వల్ల ఎముకలు బలంగా, ఆరోగ్యంగా ఉంటాయి. వీటిలో ఉండే మెగ్నీషియం, కాపర్, కాల్షియం ఆస్టియోపొరోసిస్ వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఈ గింజల్లో ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తాయి. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. హైబీపీ ఉన్నవారు ఈ గింజలు తింటే ఎంతో మేలు కలుగుతుంది. సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో మెగ్నీషియం సమృద్ధిగా ఉంటుంది. వీటిని తినడం వల్ల మెదడు పనితీరు బాగుంటుంది. ఆందోళన, ఒత్తిడి తగ్గుతాయి. సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో విటమిన్ ఇ ఉంటుంది. ఇది చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ వల్ల నష్టం కలగకుండా కాపాడుతుంది. తద్వారా చర్మం మృదువుగా, కాంతివంతంగా మారుతుంది. సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో విటమిన్ ఎ, మెగ్నీషియం ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గిస్తాయి. ఈ గింజల్లో విటమిన్ ఇ, జింక్, సెలీనియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా జలుబు, ఫ్లూ వంటి సమస్యలు రాకుండా చూసుకోవచ్చు.

# పర్సనల్ ర్యాంకింగ్స్‌లో టాప్ బెస్ట్ మూవీస్ ఇవే!



2025 ముగిసింది.. కొత్త ఏడాదిలోకి ప్రవేస్తున్నాం. ఈ ఏడాది చాలా వరకు క్రేజీ సినిమాలు, భారీ బడ్జెట్ మూవీస్‌తో పాటు కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు, బడ్జెట్ చిత్రాలు దేశ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొచ్చాయి. అందులో కొన్ని సూపర్ హిట్‌లుగా నిలిస్తే మరికొన్ని పరాజయాల్ని చవిచూశాయి. ఓవరాల్‌గా అత్యధిక శాతం సినిమాలు నిరాశపరిచినా కొన్ని సినిమాలు మాత్రం హార్ట్ ని టచ్ చేశాయి. భారీ వసూళ్లని రాబట్టి బాక్సాఫీస్ ని షేక్ చేశాయి. వ్యక్తిగత ర్యాంకింగ్స్‌లో టాప్ బెస్ట్ మూవీస్‌గా నిలిచాయి. బాలీవుడ్‌లో జాన్ అబ్రహం, సాదియా ఖతీబ్ ప్రధాన పాత్రల్లో నటించిన మూవీ –ది డిప్లొమాట్–. శివం నాయర్ దర్శకత్వం వహించారు. బలవంతపు వివాహం తరువాత పాకిస్థాన్‌లో చిక్కుకున్న భారతీయ మహిళ ఉజ్మా అహ్మద్ జీవిత కథ ఆధారంగా ఈ మూవీని రూపొందించారు. ఇదొక పొలిటికల్ థ్రిల్లర్ డ్రామా. పాక్‌లో చిక్కుకున్న మహిళ ఉజ్మా అహ్మద్‌ని దౌత్యవేత్త జెపీ సింగ్ ఎలా ఆమెకు అండగా నిలిచాడు. తనని రక్షించి ఎలా ఇండియాకు తిరిగి తీసుకొచ్చాడనే కథతో రూపొందిన సినిమా ఇది. రియల్ లైఫ్ ఎమోషనల్ డ్రామాగా ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. రిషబ్‌శెట్టి కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో రూపొందిన కన్నడ మూవీ –కాంతార చాప్టర్ 1–.తొలి భాగం సైలెంట్‌గా విడుదలై ఐదు భాషల్లో సంచలనం సృష్టించడం, బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబట్టడంతో ప్రీక్వెల్‌గా వచ్చిన –కాంతార చాప్టర్ 1–పై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఫస్ట్ పార్ట్‌కు మించి గ్రాండ్ స్కేల్ మేకింగ్, అబ్బుర పరిచే సన్నివేశాలు, షాకింగ్ క్లైమాక్స్‌తో సినిమా టాక్ ఆఫ్ ది ఇండియాగా మారింది. డివోషనల్ టచ్‌తో పీరియాడిక్ ఫీల్‌ని కలిగించడంతో ప్రతీ ఒక్కరు ఈ మూవీని లైక్ చేశారు.స్టోలెన్ హిందీతో రూపొందిన ఓ సర్వైవల్ థ్రిల్లర్. దీనికి కరణ్ తేజ్ పాల్ దర్శకత్వం వహించాడు. అభిషేక్ బెనర్జీ కీలక పాత్రలో నటించాడు. ఇద్దరు సోదరులు చిన్న పిల్లల కిడ్నాప్ వ్యవహారంలో చిక్కుకోవడంతో వారి జీవితాల్లో పెను సవాళ్లు ఎదురవుతాయి. దాని నుంచి వారు ఎలా బయటపడ్డారు అన్నదే ఈ మూవీ అసలు కథ. రియల్ ఇన్సి డెంట్స్‌ని స్ఫూర్తిగా తీసుకుని చేసిన మూవీ ఆసక్తికరమైన మలుపులతో సాగుతూ సగటుప్రేక్షకుడిని వెంటాడుతుంది. ఇదే తరహాలో క్రైమ్ స్టోరీ నేపథ్యంలో సాగే కోర్ట్ డ్రామాగా తెరకెక్కిన మూవీ –కోర్ట్–. నేచురల్ స్టార్ నాని దీన్ని నిర్మించాడు. శివాజీ, రోహిణి, శుభలేఖ సుధాకర్ మినహా అంతా కొత్త వారితో చేసిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి విజయాన్ని సొంతం చేసుకుంది. ఒక ప్రేమ జంటని విడదీయడం కోసం పోక్సో చట్టంతో అమ్మాయి బంధువు ఆడిన గేమ్ నేపథ్యంలో ఈ సినిమాని ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించారు. అత్యంత తక్కువ బడ్జెట్‌తో చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 50 కోట్ల మేర వసూళ్లని రాబట్టిందంటే ఏ స్థాయిలో ప్రేక్షకుల్లో అటెన్షన్‌ని క్రియేట్ చేసిందో అర్థం చేసుకోవచ్చు.ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షూట్, చైనీస్ యానిమేషన్ మూవీ నే ఝా 2, హాలీవుడ్ హీరో బ్రాడ్ పీట్ నటించిన ఎఫ్1 స్పోర్ట్స్ డ్రామా, గ్రాఫిక్స్ ప్రధానంగా సాగిన డివోషనల్ యానిమేషన్ మూవీ, యంగేజ్ లవ్ డ్రామా లిటిల్ హార్ట్స్, స్పై యాక్షన్ థ్రిల్లర్ సినిమాల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్న –ధురంధర్– ఈ ఏడాది విడుదలైన సినిమాల్లో పర్సనల్ ర్యాంకింగ్స్‌లో టాప్‌లో నిలిచాయి. ఇక కేసరి చాప్టర్ 2, చావా, కుబేర, రైడ్ 2, కాల్, ఎలవన్ చిత్రాలు కూడా మంచి ఇంపాక్ట్‌ని కలిగించాయి.



**ప్రియాంక ఖోల్గాడే వైట్ ఫ్లోరల్ డ్రెస్‌లో అద్భుతంగా ఉంది**



**సొగసైన చీర ఫోటోషూట్ లో బాంధవి శ్రీధర్ స్టన్స్**

## సాయిపల్లవిని ఇబ్బందిపెట్టిన దురంధర్?



దక్షిణాదిన ఎదురేలేని స్టార్ గా వెలిగిపోతోంది సాయిపల్లవి. వరుసగా బ్లాక్ బస్టర్ హిట్స్ లో నటిస్తోంది. అసలు జయాపజయాలతో పని లేని నటిగా వరుస అవకాశాలు అందుకుంటోంది. తనదైన నటన, అద్భుత డ్యాన్సింగ్ స్కిల్‌తో ఇప్పటికే పరిశ్రమలోకి వేవ్స్ పంపిన సాయిపల్లవి ఇటీవల వరుసగా పాన్ ఇండియన్ సినిమాల్లో అవకాశాలు అందుకుంటోంది.ముఖ్యంగా నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న –రామాయణం–లో సీతాదేవి పాత్రలో అవకాశం అందుకుంది ఈ భామ. ఈ చిత్రంలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా నటిస్తున్నారు. దీంతో పాటు మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన నటించిన రొమాంటిక్ డ్రామా –మేరే రహో– విడుదలకు సిద్ధమైంది. సాయిపల్లవి మరోసారి క్లాసిక్ మూవీతో ఫ్యాన్స్ ని అలరించనుంది.అయితే సాయిపల్లవి సినిమాకి –దురంధర్– బిగ్ బ్రేక్స్ వేసాడని గుసగుస వినిపిస్తోంది. నిజానికి –మేరే రహే– చిత్రాన్ని గత ఏడాది డిసెంబర్ 12న విడుదల చేయాలని ప్లాన్ చేసారు. కానీ అనూహ్యంగా వాయిదా పడింది. దీనికి కారణం రణ్‌వీర్ సింగ్ నటించిన –దురంధర్– అద్భుతంగా ఆడుతుండటమే. ఈ చిత్రం విడుదలై కొన్ని వారాల పాటు అద్భుత వసూళ్లను సాధించిన సంగతి తెలిసిందే. అదే సమయంలో కార్తీక్ ఆర్యన్ రొమాంటిక్ కామెడీ కూడా విడుదలైంది. దీంతో ఇది సరైన సమయం కాదని భావించి అమీర్ ఖాన్ బృందం ఈ చిత్రాన్ని తరవాత విడుదల చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం ఇప్పుడు 2026 వేసవిలో విడుదల కానుంది. పరిశ్రమలోని ప్రముఖులు జూలై రిలీజ్ సరైన ఆలోచన అని సూచిస్తున్నారు. –మేరే రహో– మూవీ చిత్రీకరణ సహా పోస్ట్ ప్రొడక్షన్ పూర్తయింది. ఏప్రిల్ 2025 నాటికి టాకీ చిత్రీకరణ ముగిసింది. ఈ ప్రాజెక్ట్ మార్కెటింగ్ బాధ్యతలను స్వయంగా ఆమిర్ ఖాన్ చూసుకుంటున్నారు. ట్రేడ్ ప్రకారం.. రిలీజ్ తేదీని వాయిదా వేయడం వెనక అమీర్ కీలక పాత్ర పోషించారు. డిసెంబర్ చాలా ఒత్తిడితో కూడిన సమయం. దురంధర్ అద్భుతంగా ఆడుతోంది. కార్తీక్ సినిమా కూడా వచ్చింది. అందుకే దీనిని వాయిదా వేసారని తెలుస్తోంది. –మేరే రహో– వంటి కంటెంట్ ఆధారిత ప్రేమథా చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆ రెండిటితో పోటీపడి బలమైన స్థానం సంపాదించుకోవడం కష్టమని ఆ అంతర్గత వ్యక్తి పేర్కొన్నారు. అందుకే జూలై సరైన సమయం అని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ సినిమాకి ఎక్కువ స్క్రీన్లు అవసరమని కూడా అమీర్ భావిస్తున్నారట.సాయి పల్లవి– జునైద్ ఖాన్ నటించిన ఈ చిత్రం 2016 థాయ్ రొమాన్స్ –వన్ డే– చిత్రానికి హిందీ రీమేక్. ఈ చిత్రానికి సునీల్ పాండే దర్శకత్వం వహించారు. ఇది సాయి పల్లవికి ఒక కీలక మైలురాయి. మేరే రహో అధికారిక విడుదల తేదీ ఇంకా ప్రకటించలేదు.